ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





ఎన్టీఆర్ స్టేడియంలో ఎర్రకోట మాదిరిగా వేసిన సెట్



రథంపై గౌరీ పరమేశ్వరులు

వైభవంగా గవరపాలెం గౌరమ్మ ఉత్సవం

- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లిలోని గవరపాలెంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. వేకువజాము నుంచే సతకంపట్టులోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పురవీధుల్లో గౌరీ పరమేశ్వరులను ఊరేగించారు.

- అనకాపల్లి టౌన్/ఆంధ్రజ్యోతి



సతకంపట్టులోని ఆలయం వద్ద భక్తులు

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

- ముస్తాబైన ఎన్టీఆర్ స్టేడియం

అనకాపల్లి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించే గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి రెవెన్యూ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గత రెండు రోజులుగా ఆర్డీవో షేక్ అయిషా ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఏర్పాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు. ఢిల్లీ ఎర్రకోటను తలపించే విధంగా భారీ సెట్ ఏర్పాటు చేశారు. వివిధ శాఖల నైపుణ్యతను తెలిపేందుకు స్టాల్స్‌ను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ వేడుకలు తిలకించడానికి వచ్చే ప్రజలు, విద్యార్థులు ఎండబారిన పడకుండా ఉండేందుకు గ్యాలరీలపై షామియానాలను ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం సుమారు తొమ్మిది గంటల సమయంలో ప్రారంభమయ్యే గణతంత్ర వేడుకలకు అన్నిశాఖల అధికారులు రానున్నారు. పోలీసులు పరేడ్ నిర్వహించేందుకు శనివారం రిహార్సల్స్ చేశారు.



ముస్తాబవుతున్న సభా వేదిక

నేడు విశాఖకు మంత్రి నారా లోకేశ్



విశాఖపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఒక కేసు విచారణలో భాగంగా కోర్టుకు హాజరయ్యేందుకు రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ ఆదివారం విశాఖ వస్తున్నారు. సాయంత్రం గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి రాత్రి 7.40 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి సెవెన్ హిల్స్ ఆస్పత్రి వెనుక ఉన్న పార్టీ కార్యాలయానికి వెళ్లి బస చేస్తారు. 27వ తేదీ ఉదయం కోర్టుకు హాజరవుతారు. సాయంత్రం 4.30 గంటలకు విజయవాడ బయలుదేరి వెళతారు.

పేదలకు గృహ యోగం

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద ఇళ్ల నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేయాలని నిర్ణయించింది. జిల్లాలో ఎన్నికల ముందు శ్లాబ్ వరకు నిర్మించి వదిలేసిన గృహాలను తొలిదశలో ఎంపిక చేసి త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారులు భావిస్తున్నారు. మార్చి నెలాఖరు నాటికి గృహాలను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

నెరవేరనున్న సొంతింటి కల

- పట్టణాల్లో రెండు, గ్రామాల్లో మూడు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాల కేటాయింపు
- అసంపూర్తి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు కూడా కూటమి ప్రభుత్వం ప్రణాళిక



గొలుగొండలోని ఓ కాలనీలో అరకొరగా ఇళ్ల నిర్మాణాలు



గొలుగొండలో ఇలా..

ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద పేదల ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కలెక్టర్ విజయకృష్ణన్ ఇటీవల జిల్లా అధికారులతో సమావేశమై లక్ష్యాలను నిర్దేశించారు. జిల్లాలో పీఎంఏవై అర్బన్ కింద 57,122 ఇళ్లు, పీఎంఏవై గ్రామీణ కింద 8,678.. మొత్తం 65,800 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 28,910 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. సుమారు 17,612 గృహ నిర్మాణాల పనులు ప్రారంభించలేదు. వివిధ దశల్లో పనులు నిలిచినవి 19,278 ఉన్నాయి. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వివిధ దశల్లో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటితో పాటు 2016-17, 17-18 నాటి టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ ఇళ్ల కింద మంజూరు చేసి అసంపూర్తిగా దర్శనమిస్తున్న పేదల ఇళ్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం పూర్తిచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా ... మిగతా 8వ పేజీలో

వైసీపీ నేతలు తస్కరించిన ఇనుము లభ్యం

ఎన్నికల తరువాత జగనన్న లేఅవుట్‌లో అపహరణ

- భవనం వెనుక దాచి పెట్టి కొమ్మలు కప్పేసిన వైనం
- అనకాపల్లి రూరల్ పోలీసులకు గ్రామస్థుల ఫిర్యాదు

కొత్తూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం పంచాయతీ పరిధిలో ఒక భవనం వెనుక కొమ్మలు, ఆకులతో కప్పివేసిన ఇనుమును స్థానికులు శనివారం గుర్తించారు. దీనిపై అనకాపల్లి రూరల్ పోలీసులకు వారు ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా వున్నాయి. కేబీ రోడ్డును ... మిగతా 8వ పేజీలో



వైసీపీ నేతలు ఇనుము తస్కరించి దాచి పెట్టిన దృశ్యం

సర్కారు మారినా సాగుతున్న దందా

యథేచ్ఛగా పోలవరం కాలువలోని మట్టి తవ్వి తరలింపు

- గత వైసీపీ ప్రభుత్వంలో చెలరేగిపోయిన అక్రమార్కులు
- చర్యలు తీసుకునేందుకు అధికారులు వెనుకంజ
- తాజాగా కూటమి నేతల అండదండలతో రాత్రి వేళల్లో తవ్వకాలు
- ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు



కొక్కిరాపల్లి వెంకటాపురం సమీపంలో పోలవరం కాలువ మట్టిని తవ్విన ఎక్స్‌కవేటర్‌ను అడ్డుకున్న పోలీసులు

ఎలమంచిలి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): **ప్రభుత్వం మారినా అక్రమార్కుల ఆగడాలు ఆగడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో యథేచ్ఛగా పోలవరం కాలువలోని మట్టిని తరలించుకుపోయిన అక్రమార్కులు ఇప్పుడు కూటమి నేతల అండదండలతో చెలరేగిపోతున్నారు.**

మండలంలో పలు చోట్ల చీకటి పడితే చాలు పోలవరం కాలువ మట్టిని కొందరు దర్జాగా తవ్వి తరలించేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పోలవరం కాలువ మట్టిని యథేచ్ఛగా తవ్వి తరలించేసినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేకపోయారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో అక్రమార్కులు గ్రావెల్, పోలవరం కాలువ మట్టి తవ్వకాలకు తాత్కాలికంగా బ్రేక్ ఇచ్చారు. ఇటీవల స్థానిక కూటమి నేతల అండదండలతో మళ్లీ దందా మొదలెట్టారు. రెండు రోజులుగా రాత్రి వేళల్లో పోలవరం కాలువ మట్టిని ... మిగతా 8వ పేజీలో

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

గో మాంసం అక్రమ తరలింపుపై కూడా..

- నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు
- నక్కపల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ



సీఐ, ఎస్ఐలకు సూచనలు ఇస్తున్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు

నక్కపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గంజాయి, గో మాంసం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, హైవే జంక్షన్లలో అనుమానాస్పదంగా వున్న అన్ని వాహనాలను నిశితంగా పరిశీలించాలని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు ఆదేశించారు. శనివారం సాయంత్రం నక్కపల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుతో మాట్లాడారు. పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. ఇటీవల వేంపాడులో కంటైనర్ లారీతోవెళుతున్న గోమాంసాన్ని పట్టుకున్న విషయమై ఆరా తీశారు. గంజాయి రవాణా చేసేవారు కూడా పలు రకాలుగా వ్యవహరిస్తున్నారని, ఇటీవల మీడియా ముసుగులో స్టిక్కర్లను వాహనాలకు అంటించి తరలిస్తుండగా నర్సీపట్నంలో పోలీసులు ఛేదించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రమాదాల నివారణకు కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామని సీఐ కుమారస్వామి చెప్పారు.

ఎన్టీఆర్ వైద్యాలయంలో సేవలపై ఆరా

ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ విజయకృష్ణన్

- ప్రసూతి వార్డులో డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుపై విచారణ
- బాలింతలతో మాట్లాడి వివరాల సేకరణ
- గైనిక్ వైద్యురాలిపై శాఖాపరమైన చర్యలకు ఆదేశం



బాలింతతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి టౌన్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విజయకృష్ణన్ హెచ్చరించారు. స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయాన్ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా గైనిక్ విభాగంపై ఆమె దృష్టి సారించారు. ప్రసూతి వార్డులో చికిత్స నిమిత్తం డబ్బులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదుతో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా బాలింతల వార్డును పరిశీలించారు. వార్డులో ఉన్న ప్రతి బాలింత వద్దకు వెళ్లి వైద్యం ఎలా జరిగింది?, డబ్బులు ఏమైనా ఇచ్చారా? అని అడిగి తెలుసుకున్నారు. ఎవరికీ తాము డబ్బులు ఇవ్వలేదని, వైద్యం కూడా బాగానే చేశారని వారు సమాధానమిచ్చారు. ఎక్కడి నుంచి వచ్చారని ఒక బాలింతను ప్రశ్నించగా, రాంబిల్లి నుంచి వచ్చామని, ఇక్కడైతే వైద్యం బాగా అందుతుందన్న భావంతో వచ్చామని చెప్పారు. అలాగే రావికమతం మండలానికి చెందిన ఎం.శ్యామల అనే బాలింతను కూడా కలెక్టర్ ప్రశ్నించి పుట్టిన బిడ్డను చూసి సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గైనిక్ వైద్యులు, ఆపరేషన్ థియేటర్ సిబ్బందిని విచారణ చేపట్టారు.

విచారణ అనంతరం గైనిక్ వార్డులో విధులు నిర్వహిస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న గైనిక్ వైద్యురాలిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆస్పత్రి సూపరింటెండెంట్, ఇన్‌చార్జి డీసీహెచ్ఎస్ ఎస్.శ్రీనివాసరావును కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఖాళీ బిందెలతో నిరసన

- మంచినీటి సౌకర్యం కల్పించాలని ఆదివాసీ మహిళల వేడుకోలు



మంచినీటి సౌకర్యం కల్పించాలని వేడుకుంటున్న పెదగరువు గిరిజనులు

రోలుగుంట, జనవరి 25(ఆంధ్రజ్యోతి): **మండలంలోని పెదగరువు గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళలు శనివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమకు మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు.**

మండలంలోని అర్ల పంచాయతీ శివారు పెదగరువులో 12 కుటుంబాలకు చెందిన 70 మంది కొండు ఆదివాసీలు నివాసముంటున్నారు. వారు 2018-19 ఏడాదిలో మూడు నెలల వ్యవసాయ పనులు మానుకుని సొంతంగా నుయ్యి తవ్వుకున్నారు. దీనికి అధికారులు మోటారు, పైపులు ఏర్పాటు చేశారు. ఇటీవల పైపుల ద్వారా బురదనీరు వస్తుండడంతో తాగేందుకు వీలు లేకుండా ఉంది. ఈ నీరు తాగితే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని వారు వాపోయారు. ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న అర్లకు వెళ్లి మంచినీళ్లు తెచ్చుకుంటున్నామని వారు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు మంచినీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కిల్లో సీత, కిల్లో రేష్మ, లక్ష్మి తదితరులు కోరారు.

స్క్రూ కన్వేయర్‌లో చిక్కుకుని కార్మికుడి మృతి

- ఫార్మాసిటీలో ఘటన

పరవాడ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): స్క్రూ కన్వేయర్ యంత్రంలో చిక్కుకుని ఓ ఫార్మా కార్మికుడు శనివారం మృతి చెందాడు. దీనికి సంబంధించి పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఫార్మాసిటీలోని విష్ణు కెమికల్స్ పరిశ్రమలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజ్‌వీర్‌కుమార్ (19) గత మూడు నెలలుగా హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే శనివారం విధులకు హాజరయ్యాడు. ఉదయం ఏడున్నర గంటల సమయంలో ప్రొడక్షన్ బ్లాక్ సమీపంలో గల స్క్రూ కన్వేయర్ యంత్రంలో సోడియం సల్ఫేట్ పౌడర్‌ను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తూ అతని రెండు కాళ్లు యంత్రంలో చిక్కుకుని గాయాలపాలయ్యాడు. వెంటనే తోటి కార్మికులు విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



నాడు తండ్రి.. నేడు తనయుడు

- రాష్ట్రపతి అవార్డుకు ఆర్‌పీఎఫ్ డీఐజీ శాంతారాం ఎంపిక
- ప్రస్తుతం కోల్‌కతాలో విధులు నిర్వహిస్తున్న మునగపాకవాసి
- తండ్రి రిటైర్డ్ ఎస్పీ దివంగత పెంటకోట సత్యనారాయణకు రెండుసార్లు ఇదే సత్కారం


వెంకట శ్రీధర్ శాంతారాం

మునగపాక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : విధుల్లో ఉండగా ఒకసారి, పదవీ విరమణ పొందిన తరువాత మరోసారి ఇలా రెండు పర్యాయాలు రాష్ట్రపతి అవార్డును దివంగత రిటైర్డ్ ఎస్పీ పెంటకోట సత్యనారాయణ అందుకోగా, ఇప్పుడు అతని కుమారుడు పెంటకోట వెంకట శ్రీధర్ శాంతారాం కూడా అదే ఘనతను సాధించనున్నారు. మునగపాకకు చెందిన శాంతారాం కోల్‌కతాలో రైల్వే ప్రొటక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్)లో డీఐజీగా విధులు నిర్వహిస్తున్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని అవార్డు ఆఫ్ ప్రెసిడెంట్స్ మెడల్ మారిటోరియస్ సర్వీస్ విభాగంలో శాంతారాంను శనివారం ఎంపిక చేసినట్టు అతని కుటుంబ సభ్యులు ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఆగస్టు 15వ తేదీన ఈ అవార్డు అందజేస్తారని చెప్పారు. శాంతారాం గుంటూరు, హైదరాబాద్, ఒడిశా, బెంగళూరు తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారన్నారు.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్టు

అచ్యుతాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఇక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో మోడల్ టెస్టు నిర్వహించారు. హెచ్‌ఎం ఎం.పద్మావతి, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ఎం. బాలాజీ, కృప, రాము, లక్ష్మణ్, గణేష్, వరుణ్, రవి, తాతారావు, కె.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

'చెరువులను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు'

మునగపాక. జనవరి 25 (ఆంధ్రజ్యోతి): : చెరువులను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ హెచ్చరించారు. మండలంలోని నాగవరంలో ఏషియన్ పెయింట్ సీఎస్‌ఆర్ నిధులు రూ.15 లక్షలతో అంబుజా ఫౌండేషన్ ద్వారా పునరుద్ధరణ చేసిన ఊర చెరువును శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మళ్ల జయమ్మ, ఎంపీటీసీ పాలిపిని శ్రీనివాసరావు, టెక్కలి పరశరాం, కూటమి నాయకులతో పాటు ఏషియన్ పెయింట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంపై విస్తృత ప్రచారం

- టీడీపీ శ్రేణులకు రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ 'ప్రగడ' పిలుపు
- త్వరలో నామినేటెడ్ పదవులు భర్తీ అని వెల్లడి


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు, చిత్రంలో పప్పల చలపతిరావు తదితరులు

ఎలమంచిలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు విస్తృతంగా వివరించాలని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశానుసారం త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందన్నారు. కో-ఆపరేటివ్ సొసైటీలు, మార్కెట్ కమిటీలకు సంబంధించిన పదవులు భర్తీకి రంగం సిద్ధమవుతున్నట్టు చెప్పారు. పార్టీలో కష్టపడి పనిచేసేవారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని వివరించారు. మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందించడమే ధ్యేయంగా కూటమి నేతలు పనిచేస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడమే పాలకులు లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. అనంతరం పలువురి నాయకులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ లాలం భవానీ, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, పార్టీ జిల్లా ప్రతినిధులు రాజాన సూర్య నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు గొర్లె నానాజీ, ఆడారి రమణబాబు, మండల అధ్యక్షుడు ఇత్తంశెట్టి రాజు, ఆడారి రమణమూర్తి, రెడ్డి నగేష్, బొద్దపు శ్రీనివాసరావు, రమణ, సుబ్బయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మునగపాకలో 300 అడుగుల జాతీయ జెండా ఊరేగింపు


జాతీయ జెండాను గ్రామంలో ఊరేగిస్తున్న దృశ్యం

మునగపాక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాకలో 300 అడుగుల జాతీయ జెండా ఊరేగింపు శనివారం ఉత్సాహభరితంగా సాగింది. ఇక్కడి గౌతమ పఠన మందిరం స్వర్ణోత్సవ సంబరాల్లో భాగంగా ఈ జెండాను ఊరేగించారు. దేశభక్తి గీతాలు, డప్పు, వాయిద్యాలతో సాగిన ఈ కార్యక్రమంలో ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ దిమ్మల అప్పారావు, కమిటీ అధ్యక్షుడు దాడి సూర్యనారాయణ, వెలగా శ్రీనివాసరావు, మారిశెట్టి అప్పారావు, బూడిద రామారావు, కమిటీ సభ్యులతో పాటు మొల్లేటి సత్యనారాయణ, కోనపల్లి రామ్మోహన్‌రావు, మాడెం జోగారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

జిల్లాస్థాయి క్రికెట్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుందరపు


వెదురువాడలో క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న విజయకుమార్

అచ్యుతాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణించేవారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. వెదురువాడలో మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకుని నిర్వాహకులు ఏర్పాటుచేసిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఇటువంటి పోటీల వల్ల యువతలో స్నేహభావం ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొయ్య శ్రీనివాసరావు, బుద్దరాజు రాజేష్ వర్మ, శీరా శ్రీనివాసరావు, కొయ్య మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పరమేశ్వరుల ఉత్సవ పోస్టర్ ఆవిష్కరణ

మునగపాక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాకలో ఫిబ్రవరి ఒకటో తేదీన గౌరీ పరమేశ్వరుల ఉత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే సుందరపు శనివారం ఇక్కడ ఆవిష్కరించారు. వేడుకను అంతా విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ, కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు, కోశాధికారి పొలిమేర కృష్ణతో పాటు ఎంపీపీ మళ్ల జయమ్మ, దాడి ముసిలినాయుడు, టెక్కలి పరశరాం తదితరులు పాల్గొన్నారు.

పాల సేకరణకు పరిమితిపై విశాఖ డెయిరీ రైతులు ఆందోళన


గవర్ల అనకాపల్లిలో పాల సెంటర్ వద్ద రైతులు నిరసన

మునగపాక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : పాల సేకరణపై విశాఖ డెయిరీ పరిమితి విధించిందని ఆరోపిస్తూ మండలంలోని గవర్ల అనకాపల్లిలో శనివారం డెయిరీ సభ్యరైతులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాల ఉత్పత్తులను పెంచాలంటూ పాడి పశువులు కొనుగోలుకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించిన సంస్థ మొన్నటి వరకు పరిమితి లేకుండా తీసుకున్న పాలకు నేడు కోత విధిస్తోందని మండిపడ్డారు. విశాఖ డెయిరీ చరిత్రలో ఇటువంటి సంఘటనలు ఎదురు కాలేదని వాపోయారు. పాడి ప్రధాన జీవనాధారంగా జీవనం సాగిస్తున్నామని, అర్ధంతరంగా అధిక లీటర్లు పాలు వద్దంటూ డెయిరీ నిబంధనలు విధించడం వలన నష్టపోతామని చెపుతున్నారు. పరిమితి నిబంధనలు తొలగించి, గతంలో మాదిరిగా పాలు తీసుకోవాలని వారంతా డిమాండ్ చేశారు.

'ఓటు వజ్రాయుధం వంటిది'


ఎలమంచిలి డిగ్రీ కళాశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు



రాంబిల్లిలో విద్యార్థులు, రెవెన్యూ అధికారులు అవగాహన ర్యాలీ


అచ్యుతాపురం కళాశాలలో..

ఎలమంచిలి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఎలమంచిలిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, రెవెన్యూ అధికారులు ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ కళాశాల నుంచి బస్టాండ్ జంక్షన్ వరకూ ర్యాలీ చేపట్టారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈఆర్‌వో కె.మనోరమ, తహసీల్దార్ వరహాలు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే, జంపపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఓటర్ల దినోత్సవంలో ఈఆర్‌వో, తహసీల్దార్ మాట్లాడుతూ బలమైన ప్రజాస్వామ్యం కోసం పద్ధెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా చేరి, ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మండల స్థాయిలో నిర్వహించిన డిబేట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి పి.చరణ్‌కు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, డిగ్రీ కళాశాల అధ్యాపకులు, హెచ్‌ఎం శాస్త్రి, ఉపాధ్యాయుడు బొడ్డేడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ప్రతి పౌరుడు ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని అచ్యుతా విద్యాసంస్థల కరస్పాండెంట్ పల్లి శేషగిరిరావు అన్నారు. జా తీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం విద్యా సంస్థల్లో నిర్వహించి మాట్లాడారు. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీపరులకు ఓటు వేస్తేనే మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు.

రాంబిల్లి: మండల కేంద్రం రాంబిల్లిలో ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు హైస్కూల్ విద్యార్థులు, ఓటర్లతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పద్ధెనిమిది సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే, ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ వెంకట్, ఆర్‌ఐ రవికుమార్, వీఆర్‌వోలు, హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నిందితులు, స్వాధీనం చేసుకున్న బైకులతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ విభీషణరావు

బైక్‌ల చోరీ కేసులో నిందితుల అరెస్టు

ఎస్. రాయవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి అడ్డరోడ్డులో శనివారం ఇద్దరు బైకు దొంగలను పట్టుకుని వారి నుంచి మొత్తం ఏడు బైకులు స్వాధీనం చేసుకున్నట్టు నర్సీపట్నం డీఎస్పీ పి. శ్రీనివాసరావు తెలిపారు. అడ్డరోడ్డులోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ వివరాలందించారు. శనివారం ఉదయం సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ విభీషణరావు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేస్తుండగా రేవుపోలవరం వైపు నుంచి అడ్డరోడ్డు వైపు రెండు బైక్‌లపై వస్తున్న ఎస్.రాయవరం మండలం, తిమ్మాపురానికి చెందిన సీహెచ్ దుర్గాప్రసాద్, అల్లూరి సీతారామరాజు జిల్లా, దారకొండకు చెందిన గుంటు కొమ్ములను అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా వీరు నడుపుతున్న బైక్‌లకు ఆధారాలులేవని విచారణలో తేలింది. ఈ ఇద్దరు ఎన్‌టీఆర్ జిల్లా గుడివాడకు చెందిన సత్తార్ బేగ్, విజయవాడకు చెందిన బషీర్ అనే మరో ఇద్దరితో కలిసి బైక్ దొంగతనాలు చేసి విక్రయిస్తున్నట్టు తేలినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ నలుగురిపై ఇప్పటికే వివిధచోట్ల ఎనిమిది కేసులు ఉన్నాయనిచెప్పారు. దొంగిలించిన బైక్‌లను ఏజెన్సీ ప్రాంతాలకు తరలించి విక్రయించడం అక్కడ నుంచి గంజాయి రవాణా చేస్తున్నట్టు గుర్తించామన్నారు. అయితే ఈ కేసుకు సంబంధించి సత్తార్ బేగ్‌అనే వ్యక్తి పరారీలో ఉన్నట్టు డీఎస్పీ తెలిపారు.

ఉన్నత పాఠశాల విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్

పాయకరావుపేట, జనవరి 25 : స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం పట్టణంలో ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకేషనల్ కోర్సులో హెల్త్ కేర్ ట్రేడ్‌పై అవగాహన కోసం విద్యార్థులు పట్టణంలో పలు ఆసుపత్రులకు వెళ్లి ప్రాథమిక చికిత్స, అత్యవసర వైద్య సేవలు, మందుల వినియోగం తదితర అంశాలపై వైద్యుల నుంచి తెలుసుకున్నారు. హెచ్‌ఎం పి.జాన్‌ప్రసాద్, హెల్త్ కేర్ ఉపాధ్యాయురాలు జగదీశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె' విస్తృత ప్రచారం

నక్కపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడు హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని నక్కపల్లి, జానకయ్యపేట తదితర గ్రామాల్లో ఉపాధ్యాయులను కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, తోడపు వెంకట రమణ, ప్రగడ శివాజీ, సీహెచ్ సత్యనారాయణ, ఎన్.చలపతిరావు పాల్గొన్నారు.

గ్రావెల్ ట్రాక్టర్ పట్టివేత

నక్కపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజయ్యపేట సమీపాన గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం పట్టుకుని కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సన్నిబాబు తెలిపారు. అనుమతులులేకుండా ఎవరైనా గ్రావెల్ అక్రమంగా తవ్వకాలు చేపట్టి తరలింపు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్

నక్కపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాల్లో శనివారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డీఎల్‌పీవో ఎస్‌ఎస్‌ఎస్‌ఎన్ మూర్తి, ఎంపీడీవో డీ సీతారామరాజు, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తా,చెదారాన్ని శానిటేషన్ సిబ్బందితో శుభ్రం చేయించారు. బ్లీచింగ్ చల్లారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో స్వచ్ఛభారత్ కార్యాయంలో సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబుఆధ్వర్యంలో నిర్వహించారు.

ప్రొటోకాల్‌పై రగడ

మండల సమావేశంలో టీడీపీ, వైసీపీ సభ్యుల వాగ్వాదం


టీడీపీ ప్రజాప్రతినిధులు, జడ్పీటీసీ సభ్యులు ఉమాదేవి మధ్య వాగ్వాదం

కోటవురట్ల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండల సమావేశంలో ప్రొటోకాల్‌పై టీడీపీ, వైసీపీ ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వివాదం నెలకొంది. నీలిగుంట వైసీపీ మద్దతు సర్పంచ్ ఉపాధిహామీ ఏపీవోను రాజకీయం చేస్తున్నవా..?అంటూ ప్రశ్నించడంతో వివాదం తలెత్తింది. శనివారం ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు అధ్యక్షతన సర్వసభ్యసమావేశం జరిగింది. సమావేశం ప్రారంభంలో టీకేపల్లి ఎంపీటీసీ సభ్యుడు రాంబాబు, కోటవురట్ల ఎంపీటీసీ సూర్యరావు మాట్లాడుతూ జలజీవన్ మిషన్ పథకానికి సంబంధించి గ్రామాల్లో పైపులైన్లు కోసం గ్రామాల్లో చేపట్టిన తవ్వకాలతో రహదారులు అస్తవ్యస్తంగా మారాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీవాసరావు నిలదీశారు. అలాగే చౌడువాడ సర్పంచ్ గోపాలకృష్ణ తమ గ్రామంలో జరిగే అభివృద్ధి పనుల శంకుస్థాపనలకు తనను ఆహ్వానించకుండా ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు. మరొక గ్రామానికిచెందిన టీడీపీ నేతతో తనగ్రామంలో శంకుస్థాపన చేయించారన్నారు. ఈసందర్భంగా జడ్పీటీసీ సభ్యురాలు ఉమాదేవి తనను అభివృద్ధి పనులకు పిలువలేదని అంతృప్తివ్యక్తంచేశారు ఈ సమయంలో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. ఉపాధి పథకం ఏపీ వో నాగరాజు అభివృద్ధి నివేదిక చదువుతుండగా నీలిగుంటసర్పంచ్ వరహాలబాబు, జోక్యంచేసుకుంటూ, ఏపీవోగా పనిచేయడానికి వచ్చావా.. రాజకీయాలు చేయించడానికి వచ్చావా అంటూ నిలదీశారు. ఈ విషయంపై సర్పంచ్ లింగంనాయుడు, ఎంపీటీసీ ప్రకాశ్, నీలిగుంట సర్పంచ్ మధ్య వా గ్వాదం నెలకొంది. కోటవురట్ల టీడీపీ ఎంపీటీసీ సూర్యారావుసర్ది చెప్పడంతో శాంతించారు. ఏఈ సత్యనారాయణ వైస్ ఎంపీపీలు సాగి సీతబాబు, చెక్కా సుజాత, ఎంపీడీవో కాశీవిశ్వనాథం పాల్గొన్నారు.

స్టేషన్లను తనిఖీ చేసిన డీఎస్పీ

నక్కపల్లి/ కోటవురట్ల జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గంజాయి, గో మాంసం అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. శనివారం నక్కపల్లి, కోటవురట్ల పోలీస్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి రవాణా నిరోధానికి పక్కాగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఐ కుమారస్వామి, ఎస్‌ఐ సన్నిబాబు, కోరవురట్ల ఎస్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'డీ పట్టా భూముల్లోని చెట్లకు పరిహారం ఇవ్వాలి'

నక్కపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డీ పట్టా, సాగు భూముల్లో తాము రూ. వేలాది పెట్టుబడులు పెట్టి పెంచుకున్న తోటలు, చెట్లను విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్‌కారిడార్ పనుల్లో భాగంగా నష్టపోతున్న తమకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలని రాజయ్యపేటకు చెందిన డీ పట్టాదారులు, సాగుదారులు కోరారు. శనివారం తహసీల్దార్ నర్సింహమూర్తికి వినతిపత్రం అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఎస్. రాయవరం. జనవరి 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని గెడ్డపాలెం జంక్షన్ సమీపంలో శనివారం త్రుటిలోప్రమాదం తప్పింది. అనకాపల్లి వైపు నుంచి తుని వైపు వెళ్తున్న లారీ గెడ్డపాలెంజంక్షన్ సమీపంలో ఉన్న కల్వర్టు వద్దకు వచ్చేసరికి ప్రమాదవశాత్తు అక్కడి రక్షణ గోడను ఢీకొని పక్కకు ఒరిగింది. అయితే లారీ బోల్తా పడకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

మైక్, లైటింగ్ టెంట్ హౌస్‌లో సామగ్రి దగ్ధం

ఎస్. రాయవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేవీ పాలెం గ్రామంలో శనివారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో వడ్లమూరి అప్పారావు అనే వ్యక్తి చెందిన మోజేష్ మైక్ లైటింగ్ టెంట్ హౌస్ సామగ్రి ఉంచి షెడ్ దగ్ధమైనట్టు ఎలమంచిలి అగ్నిమాపక అధికారి రాంబాబు తెలిపారు. స్థానికుల సమాచారంపై సిబ్బందితో వెళ్లి మంటలను ఆర్పినట్టు చెప్పారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని అనుమానం వ్యక్తంచేశారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం



వ్యాస రచన, డిబేట్‌లలో గెలుపొందిన విద్యార్థులతో అధికారులు

పాయకరావుపేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తహసీల్దారు జి.సత్యనారాయణ అన్నారు. కార్యాలయంలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎంఈఓ కేఎస్.గాంధీ, డీటీలు ఆనంద్, రాజేంద్రప్రసాద్‌తోపాటు ఆర్‌ఐలు, వీఆర్‌ఓలు, సిబ్బంది, పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

పాయకరావుపేట: జాతీయ ఓటరు దినోత్సవంపై నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు శనివారం వ్యాస రచన, డిబెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు మండల ప్రత్యేకాధికారి జీవీ.లక్ష్మి, ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు, ఎంఈఓ కేఎస్.గాంధీ, ఎంఈఓ-2 జి.రమేష్‌బాబు బహుమతులు అందజేశారు. ఈఓపీఆర్డీ సీహెచ్.చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఎస్. రాయవరం: . స్థానిక వినయ్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జాతీయ ఓటరు దినోత్సవంలో తహ సీల్దార్ రమేష్‌బాబు మాట్లాడారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలోని చినదొడ్డిగల్లులో హైస్కూల్ హెచ్‌ఎం బీ కవిత, రవీంద్రనాథ్ ఠాగూర్ ఆంగ్ల క్లబ్ వ్యవస్థాపకుడు వై.వెంకట రమణ మాస్టారు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నేత వెలగా సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నక్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్,బీజేపీ నాయకుడు కోసూరి శ్రీను విద్యార్థులకు ఓటు హక్కు గొప్పతనాన్ని వివరించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్స్ దేవవరపు కొండలరావు, అడ్డూరి ఈశ్వరరావు, నున్న సుబ్రహ్మణ్యంను ఘనంగా సత్కరించారు.

కోటవురట్ల: స్థానిక రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు తహసీల్దార్ తిరుమలబాబు ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షులు జానకిశ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్కారు మారినా సాగుతున్న దందా

... 7వ పేజీ తరువాయి

ఎక్స్‌కవేటర్ సహాయంతో తవ్వి తరలించేస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని వెంకటాపురం సమీపంలో పోలవరం కాలువ నుంచి శుక్రవారం రాత్రి మట్టిని తరలిస్తుండగా పోలవరం కాలువ ఏఈఈ రాజేంద్రప్రసాద్ గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రూరల్ పోలీసులు మట్టిని తరలిస్తున్న ప్రదేశానికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

పేదలకు గృహ యోగం

... 7వ పేజీ తరువాయి

గృహ నిర్మాణ సంస్థ అధికారులు వివరాలను సేకరిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు

కనీసం మౌలిక వసతులు లేని జగనన్న కాలనీలను రద్దు చేయడమే కాకుండా ఇకపై ఎన్టీఆర్ కాలనీల పేరుతో పేదలకు ఇళ్లు నిర్మించనున్నారు. ప్రధానంగా కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పేదలకు ఇకపై మూడు సెంట్లు, పట్టణాల్లో అయితే రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వం వేసిన లేఅవుట్లలో ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి, కూటమి ప్రభుత్వం నిర్మించనున్న ఎన్టీఆర్ కాలనీల్లో స్థలాలు కేటాయించనుంది. జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 720 లేఅవుట్లు వేసింది. తొలి దశ కింద 65 వేల ఇళ్లు మంజూరు చేసింది. నివాసయోగ్యం కాని కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలున్న స్థలాల్లో లేఅవుట్లు వేసింది. చాలామందికి లేఅవుట్లలో తమ ఇంటి స్థలం ఎక్కడ ఉందో తెలియక పట్టాలు చేతిలో పట్టుకొని అధికారుల చుట్టూ తిరిగేవారు. ఈ పరిస్థితులపై అధికారుల నుంచి కూటమి ప్రభుత్వం వివరాలు సేకరించింది. అలాగే కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసిన లబ్ధిదారులకు తాగునీరు, రహదారులు, ఇతరత్రా మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటోంది.

వైసీపీ నేతలు తస్కరించిన ఇనుము లభ్యం

... 7వ పేజీ తరువాయి

ఆనుకొని ఉన్న ఒక రెండతస్థుల భవనం వెనుక ఇనుమును వైసీపీ నేతలు కొమ్మలు, ఆకులు కప్పేసి దాచి పెట్టారు. గత ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్ కోసం వీఎంఆర్‌డీఏ నుంచి సంపతిపురం, కూండ్రం వరకు ఉన్న గ్రామాలకు పెద్ద ఎత్తున లారీల్లో ఇనుము వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అలాగే సిమెంటు, ఇతర సామగ్రి వచ్చిందన్నారు. ఎన్నికల ఫలితాలు తారుమారు కావడంతో వైసీపీ నాయకులు అప్పటి కొందరు అధికారుల సహకారంతో ఇనుము, సిమెంటు, పిక్క, ఇసుక తదితర సామగ్రిని ఎవరికి దొరికింది వారు తరలించుకుపోయారని చెబుతున్నారు. ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ వీటిని దాచారన్నారు. ఈ ప్రాంతంలో సుమారు వంద టన్నుల ఇనుము, 8 వేల బస్తాల సిమెంటు, ఇసుక, పిక్క, ఇటుక తదితర సామగ్రి వీరు తరలించుకుపోయారని ఆరోపించారు. సుమారు రూ.3 కోట్ల విలువ చేసే సామగ్రిని దొంగిలించేశారన్నారు. ఇందులో రొంగలివానిపాలెంకు చెందిన వైసీపీ పంచాయతీ సర్పంచ్ కూడా ఉన్నారన్నారని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై తాము 2024 సెప్టెంబరు 30న కలెక్టర్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. అయినా అధికారుల నుంచి ఎటువంటి విచారణ, చర్యలు కానరాలేదన్నారు. గత ప్రభుత్వ అధికారులే అప్పటికీ అధికారంలో ఉండడంతో తమ ఫిర్యాదుపై చర్యలు లేవన్నారు. శనివారం రాత్రి ఈ ఇనుమును కొందరు తరలించుకుపోవడానికి సన్నాహాలు చేశారు. విషయం తెలియడంతో గ్రామస్థులంతా సంఘటన స్థలానికి చేరుకున్నారు. గవరపాలెం గౌరీ పరమేశ్వరుల జాతర విధుల్లో ఉన్న రూరల్ ఎస్‌ఐ జి. రవికుమార్‌కు వారు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి హెడ్ కానిస్టేబుల్ నాయుడు బృందాన్ని సంఘటనా స్థలానికి పంపించారు. ఇనుమును స్వాధీనం చేసుకుంటున్నామని, ఎవరైనా దాని జోలికి వెళితే ఇబ్బందులు పడతారని హెచ్చరించి, రక్షణ కల్పించినట్టు తెలిసింది.

అర్హులైన పేదలందరికీ టిడ్కో గృహాలు

▸▸ అభివృద్ధి పనుల శంకుస్థాపనలో ఎమ్మెల్యే కొణతాల



అభివృద్ధి పనులకు భూమి పూజలో కొణతాల, పీలా తదితరులు

అనకాపల్లి రూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన పేదలందరికీ టిడ్కో గృహాలను కేటాయిస్తామని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ తెలిపారు. జీవీఎంసీ 84వ వార్డు పరిధి కొండకొప్పాక, కొత్తూరు, సిరసపల్లి గ్రామాల్లో రూ.4.5కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ త్వరలో కొప్పాక, సిరసపల్లిలోని నిర్మించిన టిడ్కో గృహాలను అర్హులకు అందజేయనున్నట్టు చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇందులో భాగంగానే పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, టీడీపీ నాయకులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మాదంశెట్టి నీలబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి రాజీనామా ఓ డ్రామా : బుద్ద



అనకాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వైసీపీలో ఉన్నప్పుడు ఎంపీ విజయసాయిరెడ్డి ఐదేళ్లలో ఉత్తరాంధ్రను దోచుకున్నారని, చేసిన తప్పులను కప్పిపుచ్చుకొని కేసుల నుంచి బయట పడేందుకే రాజీనామా డ్రామాలు ఆడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. బిల్డ్ ఏపీ పేరుతో విశాఖపట్నం పరిసరాల్లో భీమిలి, కాపులుప్పాడ, మధురవాడ, ఎండాడ, కొమ్మాది, పద్మనాభం, ఆనందపురంలలో సుమారు ఆరు వేల ఎకరాలు సన్నకారు, చిన్నకారు రైతుల నుంచి కారు చౌకగా, బలవంతంగా సాయిరెడ్డి కొనుగోలుచేసి సొంతం చేసుకున్నారని ఆరోపించారు. భీమిలి, భోగాపురం మధ్య ప్రతిపాదిత ఆరు వరుసల రహదారి ఎలైన్మెంట్‌ను ఆనుకొని భీమిలి మండలం నేరెళ్లవలస, బీచ్ రోడ్డు విజయనగరం జిల్లా భోగాపురం విమానాశ్రయానికి సమీపంలో పలుచోట్ల భూములు కొనుగోలుచేసి అల్లుడు, కూతురుకు చెందిన ఎల్ఎల్‌పీ కంపెనీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారని పేర్కొన్నారు. స్థానిక రైతులకు భూములు అమ్మేందుకు ఇష్టం లేకపోయినా సాయిరెడ్డి అధికారాన్ని అడ్డంపెట్టుకొని అధికారులపై ఒత్తిడి తెచ్చిమరీ రైతుల నుంచి భూములు కారుచౌకగా కొట్టేశారని ఆరోపించారు. విశాఖ సీపోర్టు వ్యవహారంలో సాయిరెడ్డి అల్లుడు మెడకు ఉచ్చు బిగుసుకోవడంతో కేవీ రావుకు తిరిగి కాకినాడ సీపోర్టును అప్పగించిన తరువాత సాయిరెడ్డి రాజీనామా డ్రామాలు ఆడుతున్నారని, వైసీపీ ప్రభుత్వం దన్నుతో చేయకూడని పాపాలన్నీచేసి ఇప్పుడు ఏమీ తెలియనట్టు రాజీనామా డ్రామాకు తెరలేపి వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. ఇప్పటికైనా సాయిరెడ్డి డ్రామాలు ఆపి, వాస్తవాలు ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

అక్షరాస్యత సాధనకు నూతన విధానంపై శిక్షణ



శిక్షకుడ్ని సన్మానిస్తున్న సబ్బవరం మండల ఉపాధ్యాయులు

సబ్బవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : 'ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసి' అంశంపై ఉపాధ్యాయులకు ఇక్కడి దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో శనివారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఆరు రోజుల పాటు కొనసాగనున్న ఈ శిక్షణ శిబిరంలో భాగంగా తొలిరోజు ఒకటి, రెండు తరగతులకు వెళ్లే ఉపాధ్యాయులు నూతన పద్ధతుల ద్వారా విద్యార్థులకు బోధన ఎలా చేయాలన్న అంశాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు లెక్కల హేమంత్ సుదేవ్, ఎలపంద స్వర్ణకుమారి తదితరులు మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలకు వైఫై కనెక్షన్ ఇచ్చిన ఏపీ ప్రభుత్వానికి, కార్పొరేట్ స్థాయిలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఏకోపాధ్యాయ పాఠశాలలకు ఒక్కో స్మార్ట్ టెలివిజన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లను సబ్బవరం మండల ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నామాల శ్యామల, మాధురి, అనిత, పీవీ చాముండేశ్వరి, అశోక్‌కుమార్, వి.నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

'భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలి'



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కమిటీ సభ్యుడు సామ్రాట్‌కుమార్

సబ్బవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సంవిధాన్ గౌరవ అభియాన్ జిల్లా కమిటీ సభ్యుడు జి.సామ్రాట్ కుమార్ పేర్కొన్నారు. రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం బీజేపీ ఆదేశాల మేరకు సబ్బవరంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని, ఆయన రచించిన భారత రాజ్యాంగం చలవ వల్లనే భారత పౌరులు స్వేచ్ఛా స్వతంత్ర్యాలు అనుభవిస్తున్నారని వివరించారు. ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేయాలన్నారు. బీజేపీ పెందుర్తి నియోజకవర్గం కో-కన్వీనర్ రెడ్డి రామునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు గొర్లి సత్యప్రసాద్, భూపతి అప్పారావు, ఆకాశ్‌కుమార్, గెడ్డం సూరిబాబు, రమేశ్, అయ్యప్ప, పేరునాయుడు, గొర్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంతులీనుతున్న కలెక్టరేట్



అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి జిల్లా కలెక్టర్ కార్యాలయం విద్యుద్దీపకాంతులతో ధగధగలాడుతోంది. ఆదివారం గణతంత్ర దినోత్సవం జరగనున్న నేపథ్యంలో కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దీంతో చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

గవరపాలెంలో ఘనమైన వేడుక

▸▸ అత్యంత వైభవంగా గౌరమ్మ ఉత్సవం ▸▸ వేకువజాము నుంచి విశేష పూజలు ▸▸ బంధుగణంతో ప్రతి ఇంట్లో సందడి

▸▸ పట్టణంలో ఎటుచూసినా జనసందోహం ▸▸ నేత్రపర్వంగా ఊరేగింపు ▸▸ ఆకట్టుకున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రదర్శనలు



గౌరీపరమేశ్వరుల ఊరేగింపు ప్రారంభోత్సవంలో పీలా గోవింద



సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు విచ్చేసి జనం



ప్రత్యేక ఆకర్షణగా కేరళ కళాకారుల నృత్యం

అనకాపల్లి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధి చెందిన స్థానిక గవరపాలెం గౌరీ పరమేశ్వరుల ఉత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైంది. తెల్లవారుజామున సతకంపట్టులోని ఆలయంలో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవంలో భాగంగా న్యాయమూర్తులు ఎస్.ధర్మారావు, రమేశ్, విజయలక్ష్మిలు అమ్మవారిని దర్శించుకున్నారు. నూకాంబిక ఆలయం తరఫున అమ్మవారికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సారె సమర్పించారు. ఉత్సవ ఊరేగింపును అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ ప్రారంభించారు. గౌరీ పరమేశ్వరులను గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, డీఎస్పీ ఎం.శ్రావణి, కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, మాదంశెట్టి నీలబాబు, తదితరులు దర్శించుకున్నారు. వీరిని ఉత్సవ కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్‌అప్పారావునాయుడు సత్కరించి అమ్మవారి చిత్రపటాలను బహూకరించారు. మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో ప్రారంభమైన అమ్మవారి ఊరేగింపు పురవీధుల గుండా సాగింది. దారి పొడవున భక్తులు గౌరీ పరమేశ్వరులను దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవంలో భాగంగా వివిధ రాష్ట్రాల కళాకారులు ప్రదర్శించిన నేలవేషాలు ఆకట్టుకున్నాయి. సుదూర ప్రాంతాల్లో ఉన్న గవరపాలెంవాసులు అమ్మవారి పండగకు కుటుంబాలతో విచ్చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి ఆధ్వర్యంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, కోశాధికారి కొణతాల నూక మహాలక్ష్మినాయుడు, కొణాల మురళీకృష్ణ, పీవీ రమణ, దాడి కృష్ణ, కొణతాల కృష్ణంరాజు, కొణతాల వెంకట వరప్రసాద్, సతకంపట్టు పెద్దల పర్యవేక్షణలో ఉత్సవం వైభవంగా జరిగింది.

ప్రజాస్వామ్య దేశంలో ఓటు అతి విలువైనది

▸▸ జాతీయ ఓటర్ల దినోత్సవంలో కలెక్టర్ విజయకృష్ణన్

▸▸ అనకాపల్లిలో వివిధ శాఖల అధికారులు, విద్యార్థులతో భారీ ర్యాలీ



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో జేసీ జాహ్నవి, వివిధ శాఖల అధికారులు



పరవాడ ర్యాలీలో తహసీల్దార్ తదితరులు



సబ్బవరంలో వివిధ శాఖల అధికారులు, కళాశాలల విద్యార్థుల మానవహారం

అనకాపల్లి టౌన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరు నమోదు చేయించుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సూచించారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియం నుంచి ఏర్పాటైన ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. మెయిన్‌రోడ్డు, నెహ్రూ చౌక్, విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి మీదుగా గుండాల జంక్షన్‌లో ఉన్న ఎస్ఆర్ శంకరన్ భవనం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మాట్లాడుతూ గతంలో మండలస్థాయి అధికారులు ఓటు హక్కును నమోదు చేసేవారని, ప్రస్తుతం టెక్నాలజీ పెరిగి సెల్‌ఫోన్, ఆన్‌లైన్‌లలో, తహసీల్దార్ కార్యాలయాల్లో ఓటు హక్కు నమోదు చేసుకునే విధంగా ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందన్నారు. ముఖ్య అతిథి డీఎస్ఎన్ఎల్ యూనివర్సిటీ ఉప కులపతి సూర్యప్రకాశరావు మాట్లాడుతూ భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు అత్యంత కీలక భూమిక పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా డీఆర్వో వై.సత్యనారాయణరావు ప్రతిజ్ఞ చేయించారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని వివిధ కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో షేక్ ఆయీషా, డీఈవో అప్పారావునాయుడు, అనకాపల్లి తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ వై.శ్రీరామ్మూర్తి, జీవీఎంసీ జోనల్ కమిషనర్ రమణ, వివిధ కళాశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మపాల : ఓటు హక్కు విలువను విద్యార్థులంతా తెలుసుకోవాలని ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.శంకర్రావు పేర్కొన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పెతకంశెట్టి బలరాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరవాడ : పద్ధెనిమిదేళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని పరవాడ తహసీల్దార్ ఎస్.వి. అంబేడ్కర్ పిలుపునిచ్చారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి పరవాడ సంతబయలు వరకు వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన అవగాహన ర్యాలీలో మాట్లాడారు. ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాలలు, హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈవో దివాకర్‌రావు, పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జీవీ నారాయణరావు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : ఓటరు దినోత్సవాన్ని సబ్బవరంలో నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకూ విద్యార్థులు ర్యాలీ జరిపి, మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం ఎంపీపీ బోకం సూర్యకుమారి, ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఏవో శివరాంప్రసాద్, ఆర్ఐ వీరయ్య, వ్యవసాయాధికారి పోతల సత్యనారాయణ, కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ బి.సీతాలక్ష్మి, ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల తీర్థం



సబ్బవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లుప్పిలో సీతారాముల తీర్థం, రాయపుర అగ్రహారంలో పరదేశమ్మ తీర్థాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచి ఆయా ఆలయాల్లో పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రాత్రికి ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సర్పంచ్‌లు ఉగ్గిన దేముడమ్మ, పిల్లల అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యురాలు ఉగ్గిన లక్ష్మి, గ్రామ పెద్దలు పాపాన ఎల్లాజీరావు తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం : జీవీఎంసీ 79వ వార్డు లంకెలపాలెం రామాలయం వద్ద ఆదివారం సీతారాముల పరస జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

తాళ్లపాలెంలో పశు వైద్యశిబిరం

కశింకోట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తాళ్లపాలెంలో శనివారం ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నూరుపాలెం పశువైద్యాధికారిణి డాక్టర్ దయానా పలు పశువులకు గర్భకోశ చికిత్సలు జరపడంతో పాటు దూడలు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గల్లా రాజు, కర్రి సత్యనారాయణ, కాయల మురళీ, ఉల్లింగల రమేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై వీవోఏలు వినతి



ఏపీవోకు వినతిపత్రం అందజేస్తున్న డ్వాక్రా వీవోఏలు

పరవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డ్వాక్రా వీవోఏలు కోరారు. ఈ మేరకు శనివారం వెలుగు ఏపీఎం రంగారావుకు వినతిపత్రం అందజేశారు. కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, బకాయి వేతనాలు చెల్లించాలన్న తదితర సమస్యల పై ఈనెల 27 నుంచి 29వ తేదీ వరకు అనకాపల్లిలోని కలెక్టరేట్ వద్ద నిరసన చేపడతామని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. వీవోఏల సంఘం ప్రతినిధులు వరలక్ష్మి, విజయ, పద్మ, సాయి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడాకారులకు అభినందనలు



జాతీయస్థాయిలో తలపడిన విద్యార్థులతో సీఐ, పాఠశాల సిబ్బంది

పరవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సంస్కృతి గ్లోబల్ స్కూల్ నుంచి ఆర్చరీ, షూటింగ్, స్విమ్మింగ్, బాక్సింగ్, వుషూ క్రీడా పోటీల్లో జాతీయస్థాయిలో తలపడిన 18 మంది క్రీడాకారులకు శనివారం సీఐ మల్లికార్జునరావు చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ విద్యా సంవత్సరంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వీరంతా సత్తా చాటి జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనడం పట్ల సీఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, సీఈవో కె.నిశాంత్, ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల నియామకానికి దరఖాస్తులు

చోడవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు న్యాయపరమైన సహాయం అందించేందుకు పారాలీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి మండల న్యాయసేవాధికార సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా స్థానిక కోర్టు పరిధిలో ఉన్న మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని పేర్కొన్నారు. అభ్యర్థులు దరఖాస్తు, ఆధార్ కార్డు, విద్యార్హత వివరాలతో పాటు పాస్ పోర్టుసైజ్ ఫొటో అందించాలని తెలిపారు కనీస విద్యార్హత పదో తరగతిగా పేర్కొన్నారు. వివిధ సేవా సంస్థలతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని, ఎంపికైన పారా లీగల్ వలంటీర్లు ఉచితంగా సేవలు అందించాలని వివరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

30న అనకాపల్లిలో ఏఐవైఎఫ్ ప్రథమ మహాసభ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తుమ్మపాల, జనవరి 25 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని సీపీఐ భవనంలో ఈ నెల 30వ తేదీన జరగనున్న ఏఐవైఎఫ్ ప్రథమ మహాసభను అంతా విజయవంతం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు కోరారు. ఈ మేరకు శనివారం ఇక్కడ విద్యార్థులతో కలిసి ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు పాల్గొన్నారు.

CLASSIFIEDS

PLOTS FOR SALE

★ 4 లక్షల 40 వేలకే ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్స్ @ అనకాపల్లి & దేవరాపల్లి గేటెడ్ కమ్యూనిటీ, క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్. ఫోన్ : 88852 87788
AJV_205227

★ సువర్ణ అవకాశము.. VMRDA అప్రూవుడ్ Plots కొత్తవలస, అయినాడలో అతి తక్కువ ధరకే అమ్మకమునకు కలవు. Cont: 7995406518.
AJV_205225

★ VUDA Plot - 179 sq.yds. S/F 33 ft. Road, Simhapuri Layout, BRTS 200 ft. Road 1/2 km Simhachalam to Vepagunta Road. Cont.: 8309494629, 9885180930
AJV_205228

★ కొత్తవలస - అరకు రోడ్డులో బొడ్డాం జం॥కి దగ్గరలో స్విమ్మింగ్ పూల్, క్లబ్ హౌస్, బ్యాంకు లోన్ & స్పాట్ రిజి॥ సౌకర్యంతో పంచాయతీ ధరలకే VMRDA అప్రూవల్ ఇండ్ల స్థలాలు. సంప్ర॥ 6303258833
AJV_205241

▸▸ High Returns Plots @ అనకాపల్లి జిల్లా కశింకోట NH5 రైల్వే స్టేషన్ దగ్గర Free గా Red శాండిల్ మొక్కలతో అందరికి గిట్టుబాటు ధరలోనే లే అవుట్ కలదు. సెల్ : 93475 81932
AJB_7893

SITE FOR SALE

★ 800 sq. yds. Vuda approved site available for sale at Boyapalem Near 100 feet Road Near Chilikuri Layout. Cont: 98668 90860
AJV_205213

TO-LET

★ 3 BHK Luxury, Semi Furnished Flat of MVV NEELADRI for Rent at Maharanipet, Visakhapatnam. Contact : 7903757988
AJV_205238

HOUSE FOR SALE

వైజాగ్ టౌన్, కొత్త రోడ్డు సెంటర్ నందు 160 చ. గజముల పాత ఇల్లు అమ్మబడును. (దీప్తి బార్ ద రెస్టారెంట్ ఆనుకొని ఉన్న సందు) సెల్ : 63050 13932
AJT_4954

TDR FOR SALE
Contact for Plan Approvals, Constructions.
PILLA BRAHMAJI RAO
Retired Building Inspector
GVMC PRESENT LICENCED SURVEYOR
92904 41348

ASTROLOGY

★ ICAS వైజాగ్ * జ్యోతిష్యం * వాస్తు * హస్తరేఖ సర్టిఫైడ్ డిప్లమో కోర్సులు * ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ * అడ్మిషన్లు జరుగుచున్నవి. క్లాసులు ప్రతీ శని, ఆదివారాలలో @ శ్రీ సహోదయ Jr. కాలేజ్, గురుద్వార్ & @ అమర్ కాన్సెప్ట్ స్కూల్, NAD కొత్తరోడ్. Ct: J. శ్రీనివాస్ ✆ 9966666659, 9441389808, www.icasindia.org
AJV_205229

EDUCATION

★ Degree, PG, MBA, MCA, B.Tech., and all Courses Admissions done with pass guidance. Help provided for Failed Students to complete degree. Ph: 7997296796
AJV_205240

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093

సౌందర్యకు ఉత్తమ బీఎల్‌వోగా రాష్ట్ర స్థాయి అవార్డు



రాష్ట్ర ఎన్నికల అధికారి విజయనంద్‌నుంచి అవార్డు అందుకుంటున్న సౌందర్య

చింతపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ బూత్ లెవెల్ అధికారిగా బలపం అగ్రికల్చర్ అసిస్టెంట్ వసుపరి సౌందర్య రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. శనివారం విజయవాడలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. ఈసందర్భంగా సమర్థవంతంగా విధులు నిర్వహించిన బీఎల్‌వోలకు అవార్డులు అందజేశారు. ఈమేరకు మండలంలోని 153బూత్‌లో బీఎల్‌వోగా పనిచేస్తున్న సౌందర్య ఏపీ ముఖ్య ఎన్నికల అధికారి కె. విజయనంద్, పూర్వ ఎన్నికల అధికారి నిమ్మగెడ్డ రమేశ్ కుమార్‌లనుంచి అవార్డును అందుకున్నారు.

పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి: సీఐటీయూ


సూపరింటెండెంట్ ప్రభావతికి వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

చింతపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలోని పారిశుధ్యం కార్మికులకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. శనివారం పారిశుధ్యం కార్మికులు పలు సమస్యలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. ప్రభావతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ పారిశుధ్యం కార్మికులు, నాలుగోవ తరగతి ఉద్యోగుల బకాయి పడిన వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. జీతాల్లో కోత విధించకుండగా పూర్తి స్థాయిలో చెల్లించాలన్నారు. నూతన కార్మికులకు పీఎఫ్ సదుపాయం కల్పించాలన్నారు. చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో వంద పడకలకు తగిన కార్మికులను నియమించాలన్నారు. గుర్తింపు కార్డు జారీ చేయడంతోపాటూ ప్రతి నెల మొదటి వారంలోనే వేతనాలు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య కార్మికుల సంఘం నాయకులు మంగవేణి, రిబిక, ఈశ్వరరావు, గిరి, సుమన్, గున్నమ్మ, బేబీ, రామారావు, గిరిబాబు పాల్గొన్నారు.

వన్య ప్రాణులపై కరుణ చూపాలి

అనంతగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణుల సంరక్షణపై శ్రద్ధ వహించాలని కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు అన్నారు. మండలంలోని గుమ్మకోట గురుకులం పాఠశాల విద్యార్థులకు జంతు సంక్షేమ పక్షోత్సంపై శనివారం అవగాహన కల్పించారు. మూగ జీవాల పోషణ, వాటి సంరక్షణపై క్షుణంగా వివరించారు.. మూగ జీవాలపై ప్రేమతో మెలగాలని, ఎక్కడైనా గాయపడిన వాటికి సానుభూతి ప్రదర్శించాలన్నారు. వేసవి నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో నీటి వసతి కల్పనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ పీవో కృషి

మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

చింతపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ కృషిచేశారని మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారి భూసేకరణలో నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం అందించేందుకు పీవో కృషి చేశారన్నారు. అధిక వర్షాలు కురిసిన సమయంలో చట్రాపల్లి గిరిజనులను ఆదుకోవడంలో ప్రత్యేక చొరవ తీసుకున్నారన్నారు. వరదల్లో గాయపడిన రోగులను వెంటనే మైదాన ప్రాంతాలకు తరలించి మెరుగైన చికిత్స అందించారన్నారు. భూవివాదాల కేసులను అత్యధిక సంఖ్యలో పరిష్కరించి న్యాయపరమైన తీర్పు ఇచ్చారన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేశారన్నారు. అధికారులకు బదిలీలు సాధారణమని, మంచి అధికారి బదిలీపై వెళ్లిపోవడం బాధాకరమన్నారు.

అంబులెన్సు డ్రైవర్ నిజాయితీ

దొరికిన సెల్ ఫోన్ అప్పగింత


బాధితుడికి ఫోన్ అప్పగిస్తున్న డ్రైవర్ దావీదు, కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పాండురాజు

చింతపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గూడెంకొత్త వీధి మండలం 108 అంబులెన్సు డ్రైవర్ దావీదు దొరికిన సెల్‌ఫోన్ బాధితుడికి అప్పగించి నిజాయితీ చాటుకున్నాడు. వివరాలివి.. శుక్రవారం అంబులెన్సులో రాగిణిని ఆమెను ఆస్పత్రికి తీసుకురావడానికి గొల్లపల్లి వెళ్లిన డ్రైవర్ దావీదుకి రహదారి మధ్యలో ఓ కంపెనీకి చెందిన ఖరీదైన ఫోన్ దొరికింది. ఫోన్‌కి వచ్చిన కాల్ ఆధారంగా అది చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ పశువులబందకు ముర్ల నాగరాజుకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఈ మేరకు శనివారం బాధితుడిని చింతపల్లి పిలిచి ఫోన్ అప్పగించారు. దొరికిన ఫోన్ బాధితుడికి అప్పగించిన డ్రైవర్ దావీదుని కరాటే కోఫోకాన్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజు, తదితరులు సన్మానించారు.

ఉపాధ్యాయులతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

» ఐటీడీఏ పీవో అభిషేక్


ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి):గిరిజన విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ఉపాధ్యాయులు పునాది వేయాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. స్థానిక లోచలిపుట్టు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన తెలుగు, ఆంగ్లం, హిందీ ఉపాధ్యాయుల రెండు రోజుల పునశ్చరణ తరగతుల ముగింపు కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొని మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక బోధన అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'సూపర్ 50' శిక్షణ తరగతులను ఏటా కొన సాగించాలన్నారు. ప్రతి తరగతిలో ఆణిముత్యాల్లాంటి విద్యార్థులుంటారని, వారిని గుర్తించి పదును పెట్టేందుకే 'సూపర్ 50' పేరిట ప్రత్యేక తరగతులకు శ్రీకారం చుట్టామన్నారు. బేస్ లైన్ ఎగ్జామ్‌లో గుర్తించిన వెనుకబడిన సి.డి. గ్రూపుల విద్యార్థుల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, వారిని చక్కగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. అలాగే ప్రతి విద్యార్థి ఉన్నతంగా చదువుకోవాలన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల్లోని మొత్తం విద్యార్థుల్లో కనీసం 30 శాతం మంది ఉత్తమ విద్యార్థులుగా ఎదిగితే ఏజెన్సీ ముఖచిత్రమే మారిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఎల్. రజని, లోచలిపుట్టు, తలారిసింగి ఆశ్రమాల హెచ్ఎంలు జీవీవీ.ప్రసాద్, టి.నాగేశ్వరరావు, మాస్టర్ ట్రైనర్లు, ఆశ్రమ పాఠశాలల్లోని తెలుగు, అంగ్లం, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక బాలసదనంలో రూ. 6 లక్షల వ్యయంతో ఆధునికీకరించిన భవనాన్ని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ శనివారం రాత్రి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా పీవోను ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, సీడీపీవోలు సత్కరించారు.

గుత్తులపుట్టు బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన

మండలంలో గుత్తులపుట్టు బాలికల ఆశ్రమ పాఠశాలను పీవో వి.అభిషేక్ శనివారం రాత్రి సందర్శించారు. ఈసందర్భంగా సూపర్ 50లో భాగంగా ప్రత్యేక బోధన పొందుతున్న టెన్త్ బాలికలతో ఆయన మాట్లాడారు. ప్రత్యేక బోధనను సద్వినియోగం చేసుకోవాలని, చక్కని ప్రతిభ చూపి విశాఖపట్నం మారికవలసలో ఉన్న కాలేజీ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ ఎల్.రజని, టీచర్లు పాల్గొన్నారు.

రోడ్లు నిర్మించకుండా రూ.కోట్లు దోచేశారు

» ఉపాధి పనులపై ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు నిలదీత » వాడీ వేడిగా మండల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోయిన కుమారి

గూడెంకొత్తవీధి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలో రహదారులు నిర్మించకుండగా రూ.కోట్ల ఉపాధి హామీ పథకం నిధులు దోచుకున్న కాంట్రాక్టర్లు, అధికారులపై చర్యలు తీసుకోవాలని గాలికొండ ఎంపీటీసీ సభ్యుడు అంపురంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిషత్ సమావేశమందిరంలో ఎంపీపీ బోయిన కుమారి అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. తొలుత వివిధ ప్రభుత్వశాఖ అధికారులు ప్రభుత్వం పథకాలు, అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులకు వివరించారు. ఎన్ఆర్ఈజీఎస్‌పై జరిగిన చర్చలో బుజ్జిబాబు మాట్లాడుతూ 2023-24లో ఉపాధి హామీ పథకం నిధులతో రహదారులు నిర్మించకుండగా కాంట్రాక్టర్లు, ఉపాధి ఉద్యోగులు, ఇంజనీర్లు కుమ్మక్కై రూ.కోట్ల నిధులు దోచుకున్నారన్నారు. ఈ విషయం రెండు నెలల క్రితం జరిగిన సామాజిక తనిఖీలో బయటపడిందన్నారు. అయినా, నేటికీ సంబంధితశాఖ ఉద్యోగులపై కనీసం చర్యలు తీసుకోలేదన్నారు. రహదారుల నిర్మాణాలు సైతం పూర్తి చేయలేదన్నారు. ప్రధానంగా లక్కవరపుపేటి సుర్రవరం, గాలికొండ పంచాయతీ ఆకులూరుతోపాటూ పలు గ్రామాల్లో రహదారులు నిర్మించకుండా నిధులు దోచుకున్న ఉద్యోగుల పై కనీస చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. ఇకనైనా కలెక్టర్, ఐటీడీఏ, మండల కమిటీ స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటూ రహదారుల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. దీనిపై ఉపాధి ఉద్యోగులు, అధికారులు కనీసం సమాధానం చెప్పకుండగా మౌనం వహించారు. ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ అటవీశాఖ అనుమతులు మంజూరుకాకపోవడంతో రహదారుల నిర్మాణాలు నిలిచిపోయినట్టు చెప్పారు. పలువురు ప్రజాప్రతినిధులు ప్రతి పాఠశాలలో పూర్తి స్థాయి ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని సభ దృష్టి తీసుకు వచ్చారు. కొన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులు లేక విద్యార్థులకు విద్య అందడంలేదన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ చిన్నారులకు పోషకాహారం పూర్తి స్థాయిలో అందించాలన్నారు. పీహెచ్‌సీల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై. ఉమామహేశ్వరరావు, ఈవోఆర్డీ పాపారావు, వైస్ ఎంపీపీలు చప్పగెడ్డ ఆనంద్, దేముడు పాల్గొన్నారు.

'మెడికల్ కళాశాలలో ఉద్యోగాలు శత శాతం ఆదివాసీలకే ఇవ్వాలి'


జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కు వినతిపత్రమిస్తున్న గిరిజన సమాఖ్య నాయకులు

పాడేరురూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పాడేరు మెడికల్ కళాశాలలో ఖాళీగా ఉన్న 244 పోస్టులు అర్హులైన ఆదివాసీ నిరుద్యోగులతోనే భర్తీ చేయాలని కోరుతూ గిరిజన సమాఖ్య, ఏఐవైఎఫ్ నాయకులు శనివారం జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో ఉద్యోగాలను శతశాతం ఆదివాసీలతోనే భర్తీ చేయాలని, కళాశాల నిర్మాణానికి స్థలం ఇచ్చిన గిరిజనులకు ఉద్యోగ, ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఆదివాసీ నిరుద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూడా రాధాకృష్ణ, ఎం. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తప్పనిసరి

» అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


మధ్యాహ్న భోజనాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

అనంతగిరి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం సూచించారు. మండలంలోని టోకూరు పంచాయతీ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా హెచ్ఎం, వార్డెన్లతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు విద్యార్థినుల ఆరోగ్య స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి, మెనూ అమలుపై విద్యార్థినులను అడిగితెలుసుకున్నారు. అక్కడ నుంచి అనంతగిరి బాలికల-2 పాఠశాలను సందర్శించి, మధ్యాహ్నం భోజనాలను పర్యవేక్షించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించేలా వారిని తీర్చిదిద్దాలని కోరారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ శెట్టి నీలవేణి, హెచ్ఎం మం గమ్మ, మెట్రిన్ రాజ్యలక్ష్మి, తదితరులు ఉన్నారు..

లంబసింగిలో పర్యాటకుల సందడి


చెరువులవేనంలో ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు

చింతపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకశ్మీర్ లంబసింగిలో పర్యాటకులతో సందడి వాతావరణం నెలకొన్నది. శనివారం లంబసింగి ప్రకృతి అందాలను వీక్షించేందుకుఅధిక సంఖ్యలో తరలి వచ్చారు. దీంతో ఉదయం ఐదు గంటల నుంచే లంబసింగి, చెరువులవేనం, తాజంగి జలాశయం వద్ద పర్యాటకులు సందడి ప్రారంభమైంది. చెరువులవేనంలో మంచుమంచు అందాలను వీక్షిస్తూ ఎంజాయ్ చేశారు. ప్రకృతి అందాలు సరసన ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం వరకు రద్దీ నెలకొంది.

అరకులోయలో..

అరకులోయ: అరకులోయకు వీకెండ్ శనివారం రోజున సందర్శకులు ఓ మోస్తరుగా విచ్చేశారు. ట్రైబల్ మ్యూజియం, ఐలవ్‌యూ అరకు బోర్డు వద్ద పలువురు ఫొటోలు దిగుతూ సందడి చేశారు. బోటుషికారు, మరికొందరు యువతీ, యువకులు జిప్‌లైనర్, స్కైసైక్లింగ్ తదితర సాహసక్రీడల్లో పాల్గొన్నారు. కళాగ్రామంలో థింసా ప్రతిమల వద్ద ఫొటోలు దిగారు. మ్యూజియంను సందర్శించారు. ఘాట్‌రోడ్‌లో గాలికొండ వ్యూపాయింట్, సుంకరమెట్ట వత్త కాఫీతోటలను పెద్ద ఎత్తున పర్యాటకులు సందర్శించారు.

ఓటు హక్కుపై అవగాహన అవసరం


ముంచంగిపుట్టులో నిర్వహించిన ర్యాలీలో అధికారులు, విద్యార్థులు

పాడేరురూరల్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కుపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీఎన్. రసూల్ అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కళాశాల్లో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. ప్రజా స్వామ్యానికి పునాది ఓటు హక్కు అన్నారు. 18 ఏళ్లు పూర్తయిన ప్రతీ విద్యార్థి ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, క్విజ్, ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్‌లు బి.రమేశ్‌బాబు, జి.గౌరీశంకరరావు, మహిళా సాధికారిక కన్వీనర్ టి.సుమిత్ర, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో ర్యాలీ

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి మూడు రోడ్ల కూడలిలోని జాతీయ రహదారిలో జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీని నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ముజీబ్ మాట్లాడుతూ, 18ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కును పొందాలని ఆయన సూచించారు. అనంతరం ప్రతిజ్ఞను చేపట్టారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ గైడెన్స్ మానిటర్ సెల్ ఇన్‌చార్జి వీఎస్ చంద్రశేఖర్, అధ్యాపకులు పూర్ణేశ్వరరావు, పార్వతమ్మ, సరోజిని, సౌజన్య, కమల్‌నాథ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీలేరులో..

సీలేరు: జీకేవీధి మండలం సీలేరులో శనివారం జాతీయ ఓటరు దినోత్సవం పురష్కరించుకుని కాలేజీ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నోటు వద్దు, ఓటు ముద్దు అంటూ నినాదాలు చేశారు. మార్కెట్ సెంటర్‌లో మానవహారంగా నిల్చున్నారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ బి. శంకరరావు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. జాతి, మతం, ధనం చూడకుండా ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ డి. శ్రీను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: మండల కేంద్రంలోని తహసీల్దార్ వీ.మాణిక్యం ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని జడ్పీటీసీ గంగరా జు, ఆర్ఐ శంకరరావు, రవీంద్ర, బాబీ, తౌటినాయుడు పాల్గొన్నారు.

చింతపల్లి: పద్దెనిమిదేళ్లు నిండిన ప్రతి ఒకరు ఓటు హక్కు కలిగి ఉండాలని స్థానిక ఉప తహసీల్దార్ చంద్రశేఖరరావు అన్నారు. శనివారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని రెవెన్యూ ఉద్యోగులు మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టారు. మానవహారం చేసి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం సీనియర్ ఓటర్లను సన్మానించారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: స్థానిక రెవెన్యూ కార్యాలయం ఆవరణలో ఓటర్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సీనియర్ సిటిజన్, పదవీ విరమణ ఉపా ధ్యాయుడు ప్రసాదుపడాల్‌ను సన్మానించారు. తహసీల్దార్ నర్సమ్మ అం దరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సుభాష్, రీసర్వే టీడీ భూపతి, సీనియర్ అసిస్టెంట్ కామరాజు, వీఆర్‌వో రమేష్, ఎలక్షన్ టైపిస్ట్ విశ్వనాథం, వీఆర్‌ఏలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అరకులోయ: అర్హులంతా ఓటుహక్కును పొందాలని తహసీల్దార్ ఎం.వి.యస్.ప్రసాద్ తెలిపారు. శనివారం మహిళా డిగ్రీ కళాశాల లో కళాశాల ప్రిన్సిపాల్ పట్టాసి చలపతిరావు అధ్యక్షతన నిర్వహించిన ఓటరు దినోత్సవ కార్యక్రమంకు ముఖ్య అతిథిగాపాల్గొని మాట్లాడారు. కళాశాలల ఎన్ఎస్ఎస్ పీవోలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ర్యాలీని చేపట్టారు.

వృద్ధులకు రగ్గులు పంపిణీ


ఓనూరులో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

పాడేరురూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంట్లమామిడి పంచాయతీ ఓనూరు పీవీటీజీ గ్రామంలో వృద్ధులకు రెడ్ క్రాస్ సొసైటీ అల్లూరి జిల్లా బృంద సభ్యులు శనివారం రగ్గులు పంపిణీ చేపట్టారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురష్కరించుకుని ఈ గ్రామాన్ని ఎంపిక చేసుకున్న బృంద సభ్యులు శనివారం సందర్శించి సుమారు 50 మంది వృద్ధులకు చలినుంచి రక్షణ పొందేందుకు రగ్గులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ఎస్.గంగరాజు, కార్యదర్శి జి.గౌరీశంకరరావు, కోశాధికారి పి.సూర్యారావు, ప్యాట్రిన్ సభ్యులు బొర్రా నాగరాజు, మేనేజింగ్ కమిటీ సభ్యులు రవి, జిల్లా కో-ఆర్డినేటర్ లోహితాస్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో


వైద్య పరీక్షలు చేస్తున్న డిఎంహెచ్‌వో జమాల్‌బాషా

డుంబ్రిగుడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరమ పంచాయతీ మారుమూల పీటీజీ గ్రామం జుర్రీపాడు పీహెచ్‌సీని శనివారం డీఎంహెచ్‌వో జమాల్ బాషా ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో బాలింతలకు అందుతున్న వైద్యం తీరును అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోనే ప్రసవాలు జరిగే కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. 104 ద్వారా జుర్రీపాడులో జరిగిన వైద్య శిబిరంలో సందర్శించిన గిరిజనులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మాతా శిశు వైద్య సంరక్షణకు కల్పించిన కార్డులను పరిశీలించారు. చిన్నారులకు అందుతున్న వైద్యంపై ఆయన అడిగి తెలుసుకున్నారు. నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించిన గిరిజనులు శస్త్ర చికిత్సలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు రాంబాబు, అంబికరమణి, ఎంపీహెచ్ఈవో శౌరీ, పీహెచ్ఎన్ రత్నం, హెచ్ఎస్ రామరావు, హెచ్‌వీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


పంచాయతీ రాజ్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న పీఆర్ ఈఈ, తదితరులు

పాడేరురూరల్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా యూనిట్ వార్షిక క్యాలెండర్‌ను పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.కొండయ్య పడాల్ శనివారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ఉద్యోగుల సంఘం పాడేరు యూనిట్ అధ్యక్షుడు, జిల్లా జాయింట్ సెక్రటరీ ఎం.సన్యాసిరావు, అల్లూరి జిల్లా నాయకులు కె.ధనలక్ష్మి, ఎల.నీలిమ, రవికుమార్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు గృహ యోగం

... 7వ పేజీ తరువాయి

గృహ నిర్మాణ సంస్థ అధికారులు వివరాలను సేకరిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతంలో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు

కనీసం మౌలిక వసతులు లేని జగనన్న కాలనీలను రద్దు చేయడమే కాకుండా ఇకపై ఎన్టీఆర్ కాలనీల పేరుతో పేదలకు ఇళ్లు నిర్మించనున్నారు. ప్రధానంగా కూటమి ప్రభుత్వం గ్రామాల్లో పేదలకు ఇకపై మూడు సెంట్లు, పట్టణాల్లో అయితే రెండు సెంట్ల ఇంటి స్థలాన్ని కేటాయించాలని నిర్ణయించింది. గత వైసీపీ ప్రభుత్వం వేసిన లేఅవుట్లలో ఇప్పటి వరకు ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారుల పట్టాలను రద్దు చేసి, కూటమి ప్రభుత్వం నిర్మించనున్న ఎన్టీఆర్ కాలనీల్లో స్థలాలు కేటాయించనుంది. జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 720 లేఅవుట్లు వేసింది. తొలి దశ కింద 65 వేల ఇళ్లు మంజూరు చేసింది. నివాసయోగ్యం కాని కొండలు, గుట్టలు, రాళ్లు, రప్పలున్న స్థలాల్లో లేఅవుట్లు వేసింది. చాలామందికి లేఅవుట్లలో తమ ఇంటి స్థలం ఎక్కడ ఉందో తెలియక పట్టాలు చేతిలో పట్టుకొని అధికారుల చుట్టూ తిరిగేవారు. ఈ పరిస్థితులపై అధికారుల నుంచి కూటమి ప్రభుత్వం వివరాలు సేకరించింది. అలాగే కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసిన లబ్ధిదారులకు తాగునీరు, రహదారులు, ఇతరత్రా మౌలిక వసతులు కల్పించడానికి చర్యలు తీసుకుంటోంది.

వైసీపీ నేతలు తస్కరించిన ఇనుము లభ్యం

... 7వ పేజీ తరువాయి

ఆనుకొని ఉన్న ఒక రెండతస్థుల భవనం వెనుక ఇనుమును వైసీపీ నేతలు కొమ్మలు, ఆకులు కప్పేసి దాచి పెట్టారు. గత ప్రభుత్వంలో జగనన్న లేఅవుట్ కోసం వీఎంఆర్‌డీఏ నుంచి సంపతిపురం, కూంద్రం వరకు ఉన్న గ్రామాలకు పెద్ద ఎత్తున లారీల్లో ఇనుము వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. అలాగే సిమెంటు, ఇతర సామగ్రి వచ్చిందన్నారు. ఎన్నికల ఫలితాలు తారుమారు కావడంతో వైసీపీ నాయకులు అప్పటి కొందరు అధికారుల సహకారంతో ఇనుము, సిమెంటు, పిక్క, ఇసుక తదితర సామగ్రిని ఎవరికి దొరికింది వారు తరలించుకుపోయారని చెబుతున్నారు. ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ వీటిని దాచారన్నారు. ఈ ప్రాంతంలో సుమారు వంద టన్నుల ఇనుము, 8 వేల బస్తాల సిమెంటు, ఇసుక, పిక్క, ఇటుక తదితర సామగ్రి వీరు తరలించుకుపోయారని ఆరోపించారు. సుమారు రూ.3 కోట్ల విలువ చేసే సామగ్రిని దొంగిలించేశారన్నారు. ఇందులో రొంగలివానిపాలెంకు చెందిన వైసీపీ పంచాయతీ సర్పంచ్ కూడా ఉన్నారన్నారని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై తాము 2024 సెప్టెంబరు 30న కలెక్టర్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. అయినా అధికారుల నుంచి ఎటువంటి విచారణ, చర్యలు కానరాలేదన్నారు. గత ప్రభుత్వ అధికారులే అప్పటికీ అధికారంలో ఉండడంతో తమ ఫిర్యాదుపై చర్యలు లేవన్నారు. శనివారం రాత్రి ఈ ఇనుమును కొందరు తరలించుకుపోవడానికి సన్నాహాలు చేశారు. విషయం తెలియడంతో గ్రామస్థులంతా సంఘటన స్థలానికి చేరుకున్నారు. గవరపాలెం గౌరీ పరమేశ్వరుల జాతర విధుల్లో ఉన్న రూరల్ ఎస్ఐ జి. రవికుమార్‌కు వారు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి హెడ్ కానిస్టేబుల్ నాయుడు బృందాన్ని సంఘటనా స్థలానికి పంపించారు. ఇనుమును స్వాధీనం చేసుకుంటున్నామని, ఎవరైనా దాని జోలికి వెళితే ఇబ్బందులు పడతారని హెచ్చరించి, రక్షణ కల్పించినట్టు తెలిసింది.

సర్కారు మారినా సాగుతున్న దందా

... 7వ పేజీ తరువాయి

ఎక్స్‌కవేటర్ సహాయంతో తవ్వి తరలించేస్తున్నారు. మునిసిపాలిటీ పరిధిలోని వెంకటాపురం సమీపంలో పోలవరం కాలువ నుంచి శుక్రవారం రాత్రి మట్టిని తరలిస్తుండగా పోలవరం కాలువ ఏఈఈ రాజేంద్రప్రసాద్ గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో రూరల్ పోలీసులు మట్టిని తరలిస్తున్న ప్రదేశానికి చేరుకుని ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

ఇంటర్వ్యూ..

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు

-సీతామహాలక్ష్మి, ఎంపీడీవో



తాగునీటి ఎద్దడి లేకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. తాగునీటి బోర్లు మరమ్మతు గురైటే బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందికి సూచించాం. పల్లె పండగ పథకం కింద రూ.10 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతు న్నాం. సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే మండలంలో ప్రతీ శనివారం పారిశుధ్య పనులు చేపడుతున్నాం.

ప్రశ్న: వేసవి ప్రారంభం కానున్నది. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చేపట్టాల్సిన చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. వేసవి కాలంలో నీటి సమస్య రాకుండా ఇప్పటికే సిబ్బందికి పలు సూచనలు ఇచ్చాం. తాగునీటి బోర్లు మరమ్మతుకు గురైతే, వాటికి బాగుచేసి వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందికి ఆదేశించాం. ఇందుకు సంబంధించి ఇప్పటికే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు తగిన సూచనలు ఇచ్చాం.

ప్ర: మండలంలో సంపద కేంద్రాల పరిస్థితి ఎలా ఉంది?

జ: మండలంలోని 28 పంచాయతీల్లో సంపద కేంద్రాలు ఉన్నాయి. దాదాపు అన్ని గ్రామాల్లోని సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకువచ్చాం. అలాగే తడి, పొడి చెత్తను వేరుచేసి సంపద కేంద్రాల వద్ద సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నాం. ప్రతీ శనివారం స్వచ్ఛభారత్‌లో భాగంగా పారిశుధ్య పనులు చేపడుతున్నాం.

ప్ర: పల్లె పండగ నిధులతో అభివృద్ధి పనులు ఎలా జరుగుతున్నాయి?

జ: ఈ పథకం కింద మండలానికి సుమారు రూ.10 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఇప్పటికే చాలా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. సీసీ రోడ్లు, కాలువలు, కల్వర్టుల నిర్మాణాలు జరుగుతున్నాయి.

ప్ర: సచివాలయాల్లో సమయ పాలన పాటించలేదని విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఏం చర్యలు తీసుకున్నారు?

జ: మండలంలోని 14 సచివాలయాలు ఉన్నాయి. ఉదయం పది గంటలకు సిబ్బంది సచివాలయాల్లో ఉండాలని సూచించాం. తరచూ సచివాలయాలను తనిఖీలు చేస్తున్నాం. విధులకు సకాలంలో హాజరుకాని సిబ్బందిపై చర్యలు తీసుకుంటున్నాం. అలాగే వారిపై ఫిర్యాదులు వస్తే పరిగణనలోకి తీసుకుటాం.

-మాకవరపాలెం, ఆంధ్రజ్యోతి

గ్రామాల్లో చురుగ్గా అభివృద్ధి పనులు

నాతవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయని టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ చెప్పారు. మండలంలోని వెన్నలపాలెం గ్రామంలో శనివారం రూ.40 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిమ్మెంట్ రహదారులు, కాలువల పనులకు నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజుతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రూ.40 లక్షలతో వెన్నలపాలెంలో అభివృద్ధి పనులు చేపట్టామని, ఇవి పూర్తయితే డ్రైనేజీల సమస్య తీరుతుందని చెప్పారు. అలాగే రహదారులు పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోరుప్రోలు వెంకటేశ్, పారుపల్లి రామచంద్రరావు,

గ్రామ సచివాలయ ఉద్యోగులు పనితీరు మార్చుకోవాలి

గొలుగొండ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయ ఉద్యోగులు పనితీరు మార్చుకోవాలని డివిజనల్ అభివృద్ధి అధికారిని ఉదయశ్రీ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సచివాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అప్పగించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ విషయంలో గ్రామ సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా గొలుగొండ మండలం వెనుకబడిందన్నారు. ఈ సర్వేలపై ప్రత్యేక దృష్టిసారించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. అలాగే సచివాలయాల్లో సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మేరీరోజీ, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొత్తనాగయ్యపేటలో విద్యుత్ స్తంభాలు మార్చాలని వినతి

దేవరాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగయ్యపేట శివారు కొత్త నాగయ్యపేటలో విద్యుత్ స్తంభాలు మార్చాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. గుల్లిపల్లి సన్నిబాబు ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టి నెల రోజులు గడుస్తున్నా, మధ్యలో ఉన్న స్తంభాలను మార్చకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రోడ్డు నిర్మించిన ఫలితం లేకపోతున్నదని వాపోయారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలు ఎందుకు?

మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ధ్వజం

మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశంలో ప్రస్తావించిన సమస్యలపైనే స్పందించకపోతే ఎలాగని అధికారుల నిలదీత



సర్వసభ్య సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

దేవరాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు నిర్వహించడం ఎందుకని ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. మూడు నెలలకు ఒక సారి జరిగే సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలపైనా అధికారులు స్పందించకపోతే ఎలాగని నిలదీశారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి అధ్యక్షతన శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలిగొట్ల సర్పంచ్ సుధారాణి, బి.కింతాడ సర్పంచ్ బాబూరావుతో పాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశాల్లో ప్రస్తావించిన సమస్యలపై కూడా అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించనప్పుడు ఈ సమావేశం నిర్వహించడం ఎదుకని నిలదీశారు. దీనికి ఎంపీడీవో సువర్ణరాజు స్పందిస్తూ మండల సమావేశంలో తెలిపిన సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాటుసారా నిర్మూలనకు నవోదయం పేరుతో కమిటీలు వేయనున్నటుట చోడవరం ఎక్సైజ్ శాఖ హెడ్ కానిస్టేబుల్ అప్పలనాయుడు తెలిపారు. ప్రధానంగా నాటుసారా తయారు చేస్తున్న గ్రామాల్లో ఈ కమిటీలు వేస్తున్నామన్నారు. ఓటర్ల దినోత్సవం సందర్భంగా సమావేశంలో సభ్యులు, అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు గంగాభవాని, జడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు, మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయండి

» ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

మాడుగుల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజలకు చేరువ చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మాడుగుల శివారు తాచేరు కాలువ సమీపంలోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని సూచించారు. మాడుగుల పంచాయతీ పరిధిలోని దుర్గాలమ్మ ఆలయ సమీపంలో చికెన్ దుకాణాల స్థానంలో నూతనంగా పంచాయతీ షెడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయని చెప్పారు. అక్కడ దుకాణాలను తొలగించి వేరే చోటుకు మార్పు చేయాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు.

అనంతరం మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వెనుక కోడూరు వెళ్లే రహదారిలో కోల్డ్ స్టోరేజీని పరిశీలించారు. మోదమాంబ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న గత హాస్టల్ పరిశీలించిన ఆయన, అక్కడ వ్యవసాయ మార్కెట్ యార్డులు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రంజిత్‌వర్మ, నాయకులు ఉండూరు దేముడు, పుప్పాల రమేశ్, డిల్లీ నానాజీ, పంచాడ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోండి

» పశు సంవర్ధక శాఖ జేడీ చెల్లయ్య





జి.కోడూరులో ఆవుకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న జేడీ... చుక్కపల్లిలో నట్టల నివారణ మందులు అందిస్తున్న ఏడీ

మాకవరపాలెం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పశు సంపద సంరక్షణ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టరు చెల్లయ్య సూచించారు. మండలంలోని జి.కోడూరు, సీతన్నఅగ్రహారం గ్రామాల్లో శనివరం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలోనూ పశు ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలు, కోళ్లకు టీకాలతో పాటు నట్టల నివారణ, గర్భకోశ వ్యాధి నిరోధిక టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. బహుళ పశుగ్రాసాల సాగు, సంచార పశు ఆరోగ్య సేవా వాహనాలు, పశు బీమా పథకం ప్రయోజనాలను రైతులకు వివరించారు. ప్రతీ రైతుకు ప్రభుత్వం మినీ గోకులాలు షెడ్లు మంజూరు చేసిందని, వీటిని వినియోగించుకోవాలని సూచించారు. రెండు గ్రామాల్లో 210 పశువులకు వైద్య సేవలు అందించినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొడ్డెటి అమ్మాజీలక్ష్మి, పశు వైద్యులు అనిల్ కుమార్, మణిదీప్, సిబ్బంది పాల్గొన్నారు.

చీడికాడ: మండలంలోని చుక్కపల్లి, మంచాల గ్రామాల్లో శనివారం పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వి.చిట్టినాయుడు మాట్లాడుతూ పశు వైద్యం గురించి రైతులకు వివరించారు. ఈ శిబిరాల్లో పశు వైద్యాధికారులు గణేశ్, రాఘవమ్మ, పశువైద్య సిబ్బంది సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో చోడవరం విద్యార్థిని ప్రతిభ

జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం.. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న విద్యార్థిని ప్రజ్ఞశ్రీ

చోడవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో అధికారులు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కొత్తూరు జెడ్పీ హైస్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థిని దడాల ప్రజ్ఞశ్రీ ప్రతిభ కనబర్చింది. యువతలో ఓటు హక్కుపై చైతన్య కలిగించే లక్ష్యంతో నిర్వహించిన ఈ పోటీల్లో ప్రజ్ఞశ్రీ రాసిన వ్యాసం జిల్లా స్థాయికి ఎంపికైంది. దీంతో శనివారం అనకాపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ విజయ్‌కృష్ణన్ విద్యార్థినికి షీల్డుతో పాటు ప్రశంసాపత్రం అందించారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన ప్రజ్ఞశ్రీని హెచ్ఎం రామిరెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ జి.సత్య, స్థానిక నేత సత్తిబాబు తదితరులు అభినందించారు.

అంకుపాలెంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు



కబడ్డీ క్రీడాకారుల ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ... పోటీలో తలపడుతున్న క్రీడాకారిణులు

చోడవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకుపాలెంలో దుర్గాంబిక తీర్థం సందర్భంగా శనివారం రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను విశాఖ నగర ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయి. కార్యక్రమంలో నిర్వాహకులు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో చెట్టుపల్లి విద్యార్థులకు పతకాలు



విద్యార్థినులను అభినందిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన చెట్టుపల్లి జడ్పీహెచ్ స్కూల్ విద్యార్థినులను ఆర్డీవో వీవీ.రమణ అభినందించారు. ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఛత్తీసగఢ్‌లోని దల్లిరాజర జిల్లాలో ఈ నెల 18 నుంచి 22వ తేదీ వరకు పోటీలు జరిగాయి. ఎ.పూర్వజ (52 కిలోలు) స్వర్ణం, ఎం.మణి (47 కిలోలు) సిల్వర్ మెడల్, సీహెచ్.కావ్య (43 కిలోలు) బ్రాంజ్ మెడల్, జె.అక్షయ (57 కిలోలు) బ్రాంజ్ మెడల్, ఎం.అమృతవల్లి (69 కిలోలు) సిల్వర్ మెండల్ సాధించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామకృష్ణ, పీడీ దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

న్యాయ సహాయకుల నియామకానికి దరఖాస్తులు

చోడవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలకు న్యాయపరమైన సహాయం అందించేందుకు పారాలీగల్ వలంటీర్లుగా పనిచేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలి మండల న్యాయసేవాధికార సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా స్థానిక కోర్టు పరిధిలో ఉన్న మండల న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని చెప్పారు. అభ్యర్థులు తమ దరఖాస్తు, ఆధార్ కార్డు, విద్యార్హత వివరాలతో పాటు పాస్ పోర్టుసైజ్ ఫొటో అందించాలని తెలిపారు అభ్యర్థుల కనీస విద్యార్హత పదో తరగతిగా ఆయన పేర్కొన్నారు. వివిధ సేవా సంస్థలతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఉంటుందని, ఈ పోస్టుల కోసం ఎంపికైన పారా లీగల్ వలంటీర్లు ఉచితంగా సేవలు అందించాలని చెప్పారు. ఎంపికైన వలంటీర్లకు ఏడాది పదవీ కాలం ఉంటుందని ఆయన వివరించారు.

రావికమతంలో ఎట్టకేలకు బోరు బావి నిర్మాణం

రావికమతం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎంతో కాలంగా తాగునీటి సదుపాయానికి నోచుకోని రావికమతం నూకాలమ్మతల్లి ఆలయం వద్ద ఎట్టకేలకు ఎంపీటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ చొరవతో తాగునీటి బోరు బావి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ ఆలయం పొలాల వద్ద ఉండడంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఏటా తాగునీటి సమస్య తలెత్తేది. దీన్ని అధిగమించడానికి గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఎంపిటీసీ సభ్యుడు గంజి సూర్యనారాయణ దృష్టికి కమిటీతో పాటు గ్రామస్థులు ఈ సమస్య తీసుకువచ్చారు. మండల పరిషత్ నిధులతో అమ్మవారి ఆలయం వద్ద బోరు బావి నిర్మాణానికి ఆయన చర్యలు చేపట్టారు. ఇకపై ఆలయానికి వచ్చే భక్తులకు, సమీప పొలాల రైతులకు ఈ బోరు బావి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శంకుస్థాపన కార్యక్రమంలో కూటమి నాయకులు వేపాడ నాగేశ్వరావు, గంజి శ్రీను, ఈశ్వరరావు, ఉప్పులూరి నాగేశ్వరావు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు



గౌరీపరమేశ్వరులను ఊరేగిస్తున్న భక్తులు

గొలుగొండ జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగుమ్మల గ్రామంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. పురవీధుల్లో గౌరీపరమేశ్వరుల ప్రతిమను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో భక్తులు హాజరై పలు రకాల పిండి వంటలతో సారె సమర్పణ కార్యక్రమం చేపట్టారు. అనంతరం గౌరీపరమేశ్వరులను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు లెక్కల అప్పనాయుడు, సర్పంచ్ చినబ్బాయి, భక్తులు పాల్గొన్నారు.

బి.కింతాడలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం

దేవరాపల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బి.కింతాడలో సర్పంచ్ బూరే బాబూరావు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యదర్శి జామి అప్పారావు, కడింనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

'అంబేడ్కర్ ఆశయాలతో ముందుకు సాగుదాం..'

కె.కోటపాడు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుదామని సంవిధాన్ గౌరవాభియాన్ జిల్లా కమిటీ సభ్యుడు జి.సామ్రాట్‌కుమార్ పిలుపునిచ్చారు. రాజ్యాంగం అమలు దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కె.కోటపాడు రెల్లివీధిలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ రాజ్యాంగం ఆధారంగానే హక్కులు, రాజకీయ పదవులు లభించాయని తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు భూపతి అప్పారావు, శ్రీనివాస్, బి.అప్పలరాజు, బి.బాలకృష్ణ, బి.గణేశ్, ఎస్.సన్యాసినాయుడు, సత్యప్రసాద్, శివ, సన్యాసిరావు, ఆకాష్‌కుమార్, రాము, రెల్లివీధి మహిళలు పాల్గొన్నారు.



చోడవరంలోని కొత్తూరు జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఘనంగా ఓటరు దినోత్సవం

చోడవరం/నర్సీపట్నం/రావికమతం/మాడుగుల/రోలుగుంట/దేవరాపల్లి/చీడికాడ/గొలుగొండ/మాకవరపాలెం/నాతవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో విద్యార్థులతో ర్యాలీలు, మానవహారాలు నిర్వహించి ఓటు హక్కుపై నినాదాలు, ప్రతిజ్ఞ చేశారు. చోడవరంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ అంబటి రామారావు, ఎంపీడీవో వీఏఎస్‌జే ఆంజనేయులు, ఈవోపీఆర్డీ మహేశ్, ఈవో నారాయణరావు, ఎలక్షన్ ఆర్ఐ రాజ్‌భరత్, ఉషోదయ కళాశాల డీన్ వాసు, డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్ పీవోలు, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే నర్సీపట్నంలో ఆర్డీవో వీవీ.రమణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, విద్యార్థులతో శ్రీకన్య కూడలి నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేసి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల, పాఠశాల స్థాయిలో వ్యాస రచన పోటీలలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, తహసీల్దార్ రామారావు, ఎలక్షన్ డీటీ సుధావాణి, ఎంపీడీవో కార్యాలయం పర్యవేక్షణ అధికారి రమణబాబు పాల్గొన్నారు. రావికమతంలో తహసీల్దార్ బి.వెంకటరమణ ఆధ్వర్యంలో ర్యాలీ, నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌డీటీ జి.అప్పలనాయుడు, ఆర్ఐ సతీశ్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గొలుగొండ మండలంలోని పలు పాఠశాలల్లో వ్యాచరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం గురుకుల కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో మేరీరోజీ, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు. మాకవరపాలెం తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అలాగే హైస్కూల్‌లో ఓటు హక్కుపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఈవో మూర్తి బహుమతులు అందజేశారు. తూటిపాల పాఠశాలలో హెచ్ఎం రాము ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు.

మాడుగుల మండల కేంద్రంలో తహసీల్దార్ కె.రమాదేవి పర్యవేక్షణలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ రాజా ఓటర్ల దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కు విలువ గురించి వివరించారు. ఇద్దరు సీనియర్ ఓటర్లకు తహసీల్దార్ రమాదేవి, నియోజకవర్గ ఎన్నికల అధికారి అనిత, ఎలక్షన్ డీటీ రాజా, హెచ్‌డీటీ లక్ష్యయ్య సత్కరించారు. నాతవరం హైస్కూల్‌లో ఓటరు దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ ఎ.వేణుగోపాల్ మాట్లాడుతూ సామాన్యులకు కూడా ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి పార్థసారథి, మాజీ ఎంపీపీలు కొండబాబు, విజయ్‌కుమార్, నాయకులు చిటికెల శ్రీనివాసు, ఎ.యర్రాపాత్రుడు బి.సూరిబాబు, నానాజీ, గోపి పాల్గొన్నారు.

రోలుగుంట మండలంలోని జె.నాయుడుపాలెంలో ఓటు ప్రాధాన్యం తెలియజేస్తూ విద్యార్థులు అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఓటర్ల డే ఆకారంలో విద్యార్థులు ఏర్పడి అవగాహన కల్పించారు. దేవరాపల్లి తహసీల్దార్ కార్యాలయం నుంచి నాలుగు రోడ్ల వరకు ర్యాలీ చేసి మానవహారంగా ఏర్పడ్డారు. ఎంఈవో పడాల్‌దాసు, డీటీ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. చీడికాడలో రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ కె.రామారావు ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ర్యాలీ చేశారు. వీఆర్వో చలుగు సత్యనారాయణ, హైస్కూల్ పీఈటీ మల్లేశ్వరి పాల్గొన్నారు.

రాష్ట్రంలో జగన్ పార్టీ భూస్థాపితం

టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్



నర్సీపట్నం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జగన్ పార్టీ రాష్ట్రంలో భూస్థాపితకం అవుతుందనడానికి విజయసాయిరెడ్డి రాజీనామానే సంకేతమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో అన్ని వర్గాల ప్రజలు ఆ పార్టీని వదిలిపెట్టే పరిస్థితి వస్తుందన్నారు. రాజీనామా చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని, మాజీ సీఎం జగన్‌తో కలిసి విజయసాయిరెడ్డి కొత్త డ్రామాలు ఆడుతున్నారని ఆయన విమర్శించారు. విజయసాయిరెడ్డి చేసిన అక్రమాలపై తానే స్వయంగా ఫిర్యాదు చేస్తానన్నారు. అశోక్‌గజపతిరాజు ఆస్తులు కాజేయడం కోసం సింహాచలం దేవస్థానం ఛైర్‌పర్సన్‌గా వేరే వ్యక్తిని నియమించారని ఆరోపించారు. టీడీపీ నాయకులను టార్గెట్ చేసి అనేక కేసులు పెట్టారని, అయినా తమ నాయకులు ధైర్యంగా ఎదుర్కొన్నారని ఆయన పేర్కొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	120.00
లైవ్ ధర	140.00
విత్ స్కిన్	250.00
స్కిన్ లెస్	260.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

CLASSIFIEDS

PLOTS FOR SALE

★ 4 లక్షల 40 వేలకే ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్స్ @ అనకాపల్లి & దేవరాపల్లి గేటెడ్ కమ్యూనిటీ, క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్. ఫోన్ : 88852 87788
AJV_205227

★ సువర్ణ అవకాశము.. VMRDA అప్రూవ్డ్ Plots కొత్తవలస, అయినాడలో అతి తక్కువ ధరకే అమ్మకమునకు కలవు. Cont: 7995406518.
AJV_205225

★ VUDA Plot - 179 sq.yds. S/F 33 ft. Road, Simhapuri Layout, BRTS 200 ft. Road 1/2 km Simhachalam to Vepagunta Road. Cont.: 8309494629, 9885180930
AJV_205228

★ కొత్తవలస - అరకు రోడ్డులో బొద్దాం జంకి దగ్గరలో స్విమ్మింగ్ పూల్, క్లబ్ హౌస్, బ్యాంకు లోన్ & స్పాట్ రిజి॥ సౌకర్యంతో పంచాయతీ ధరలకే VMRDA అప్రూవల్ ఇండ్ల స్థలాలు. సంప్ర॥ 6303258833
AJV_205241

» High Returns Plots @ అనకాపల్లి జిల్లా కశింకోట NH5 రైల్వే స్టేషన్ దగ్గర Freeగా Red శాండిల్ మొక్కలతో అందరికి గిట్టుబాటు ధరలోనే లే అవుట్ కలదు. సెల్ : 93475 81932
AJB_7893

SITE FOR SALE

★ 800 sq. yds. Vuda approved site available for sale at Boyapalem Near 100 feet Road Near Chilikuri Layout. Cont: 98668 90860
AJV_205213

TO-LET

★ 3 BHK Luxury, Semi Furnished Flat of MVV NEELADRI for Rent at Maharanipet, Visakhapatnam. Contact : 7903757988
AJV_205238

HOUSE FOR SALE

వైజాగ్ టౌన్, కొత్త రోడ్డు సెంటర్ నందు 160 చ. గజముల పాత ఇల్లు అమ్మబడును. (దీప్తి బార్ ద రెస్టారెంట్ ఆనుకొని ఉన్న సందు) సెల్ : 63050 13932
AJT_4954

TDR FOR SALE

Contact for Plan Approvals, Constructions.
PILLA BRAHMAJI RAO
Retired Building Inspector
GVMC PRESENT LICENCED SURVEYOR
92904 41348

ASTROLOGY

★ ICAS వైజాగ్ * జ్యోతిష్యం * వాస్తు * హస్తరేఖ సర్టిఫైడ్ డిప్లమో కోర్సులు * ఆన్‌లైన్ / ఆఫ్‌లైన్ * అడ్మిషన్లు జరుగుచున్నవి. క్లాసులు ప్రతీ శని, ఆదివారాలలో @ శ్రీ నవోదయ Jr. కాలేజ్, గురుద్వార్ & @ అమర్ కాన్సెప్ట్ స్కూల్, NAD కొత్తరోడ్. Ct: J. శ్రీనివాస్ ✆ 9966666659, 9441389808, www.icasindia.org
AJV_205229

EDUCATION

★ Degree, PG, MBA, MCA, B.Tech., and all Courses Admissions done with pass guidance. Help provided for Failed Students to complete degree. Ph: 7997296796
AJV_205240

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా సమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176
9966165093